RNI. No: TELTEL/2023/88215

# తెలంగాణ దిశ

TELANGANA DISHA TELUGU DAILY | తెలుగు దినపత్రిక

మల్కాజిగిరి MALKAJGIRI | సంపుటి : 3 VOLUME : 3 | సంచిక : 259 ISSUE NO : 259 | ఎడిటర్ : మెరుగు చంద్రమోహన్ EDITOR : MERUGU CHANDRAMOHAN | శనివారం, ఏప్రిల్, 11, 2026 Saturday, April, 11, 2026 | పేజీలు : 8 వెల : రూ.4/- PAGES : 8 RS : 4 /-




వరంగల్ కాకతీయ మెడికల్ కాలేజీలో

## ర్యాగింగ్ కలకలం

### ఏడుగురు విద్యార్థుల సస్పెన్షన్

**వరంగల్,తెలంగాణ దిశ :** జూనియర్ విద్యార్థులను వేధించినట్లు రుజువు కావడంతో వరంగల్‌లోని కాకతీయ మెడికల్ కాలేజీ (కేఎంసీ)లో ఏడుగురు థర్డ్ ఇయర్ ఎంబీబీఎస్ విద్యార్థులపై యాజమాన్యం కఠిన చర్యలు తీసుకుంది. వారినిఆరు నెలల పాటు క్లాసుల నుంచి సస్పెండ్ చేయడంతో పాటు, కోర్సు పూర్తయ్యేంత వరకు హాస్టల్ నుంచి శాశ్వతంగా బహిష్కరించింది. ఈ మేరకు కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్య ఉత్తర్వులు జారీ చేశారు. వివరాల్లోకి వెళితే.. కొందరు సెకండ్ ఇయర్ విద్యార్థులు తమ సీనియర్ల గురించి వాట్సాప్ గ్రూప్‌లో కొన్ని కామెంట్లు చేశారు. ఇది తెలుసుకున్న సీనియర్లు ఆగ్రహంతో జూనియర్లను హాస్టల్ టెర్రస్‌పైకి పిలిపించారు. వారిని మోకాళ్లపై నిలబెట్టి క్షమాపణ చెప్పిం చారు. ఈ ఘటనను కొందరు జూనియర్లు తమ ఫోన్లలో రహస్యంగా వీడియో తీశారు. అనంతరం, నేరుగా వీడియో ఆధారాలతో నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) ఆన్‌లైన్ పోర్టల్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ఎన్ఎంసీ, విచారణ జరపాలని రాష్ట్ర వైద్య విద్య డైరెక్టరేట్ (డీఎంఈ)ను ఆదేశించింది.

కాళేశ్వరం ప్రాజెక్టు 3 బ్యారేజీలకు

## మరమ్మతులు

### సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు



హైదరాబాద్, :కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులోని మూడు బ్యారేజీలకు మరమ్మతులు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మూడు బ్యారేజీలను మరమ్మతుల అనంతరం వినియోగంలోకి తీసుకురావాలని చెప్పారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్ఏ) సూచనల మేరకు వీలైనంత త్వరగా బ్యారేజీల మరమ్మతు పనులను వేగవంతం చేయాలని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో మం త్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఇతర ఉన్నతాధికారులతో కలిసి కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుకు సంబంధించి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కాళేశ్వరం ప్రాజెక్టు మరమ్మతుల కోసం ప్రత్యేక కార్యాచరణను రూపొందించి నిరంతరం పర్యవేక్షణ చేయాలని అధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు.



మహిళల రాజకీయ సాధికారతకు

## చారిత్రాత్మక నిర్ణయం

### రిజర్వేషన్ బిల్లుకు మోదీ పిలుపు

హైదరాబాద్: ఏప్రిల్ 10: భావితరాల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని మహిళా రిజర్వేషన్ బిల్లును ఆమోదించాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్ని పార్టీల పార్లమెంట్ సభ్యులకు విజ్ఞప్తి చేశారు. పార్లమెంట్ లో మహిళా రిజర్వేషన్ల చట్టసవరణ బిల్లుకు ప్రారంభ లెక్కలు మొదలైన నేపథ్యంలో, ఏప్రిల్ 16, 17, 18 తేదీల్లో నిర్వహించనున్న ప్రత్యేక సమావేశాలకు హాజరై బిల్లును ఏకగ్రీవంగా ఆమోదించాలని ఆయన కోరారు. 2029 సాధారణ ఎన్నికల నుండి మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే ఈ బిల్లు దేశ రాజకీయాల్లో మహిళల భాగస్వామ్యాన్ని పెంచే కీలక సంస్కరణగా భావిస్తున్నారు.

**ఖమ్మం,తెలంగాణ దిశ :** తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీపై నిప్పులు చెరిగారు. రాజకీయ విమర్శల విషయంలో మంత్రి పొంగులేటి మరింత ఘాటుగా స్పందిస్తూ, తమకు అంటిన బురదను అధికార పార్టీ నేతలకు అంటించాలని కొంతమంది ప్రయత్నిస్తున్నారని మండిప డ్డారు. ఎవరు ఎన్ని అవాకులు చవాకులు పేలినా, కారుకూ తలు కూసినా ఈ ప్రభుత్వం పేదలకు అండగా నిలుస్తుం దని, ప్రతిపక్షాల తాటాకు చప్పుళ్లకు తాము బెదిరే ప్రసక్తే లేదని హెచ్చరించారు. భవిష్యత్తులో కూడా ఇందిరమ్మ రాజ్యాన్ని ప్రజలు దీవించడానికి సిద్ధంగా ఉన్నారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం చేగొమ్మలో నూతనంగా నిర్మించిన గోదాము ప్రారంభోత్స వం సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, ధాన్యం సేకరించిన వారం రోజుల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తున్నామని స్పష్టం చేశారు.



బీఆర్ఎస్ ఆరోపణలపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తిన..

## పొంగులేటి...

'హర్మూజ్' నిర్వహణపై మొజ్తాబా..

## కీలక ప్రకటన

### కొత్త దశకు తీసుకెళ్తామని వ్యాఖ్య..!

ఢిల్లీ,: హర్మూజ్ జలసంధి నిర్వహణపై ఇరాన్ సుప్రీం నేత మొజ్తాబా ఖమేనీ కీలక ప్రకటన చేశారు. జలసంధి నిర్వహణను కొత్త దశకు తీసుకెళ్తామని ఆయన ప్రకటించారు. ఈ దశలో హర్మూజ్‌పై అనుసరించే విధానం మరిం త వ్యూహాత్మకంగా, కఠినంగా ఉంటుందని సంకేతాలు ఇచ్చారు.



## అతివిశ్వాసమా? వ్యూహాలోపమా?

చెన్నై, : తమిళనాడు రాజకీయాల్లో దళపతి విజయ్ తన తమిళగ వెట్రి కళగం పార్టీతో ఒక సంచలనంలా మెరిసినప్పటికీ, ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ క్షేత్రస్థాయిలో ఆయన ఎదుర్కొంటున్న సవాళ్లు ఆయన్ని వెనుకబడిపోయేలా చేస్తున్నాయి. ఏప్రిల్ 23, 2026న జరగనున్న పోలింగ్‌కు ముందు తమిళనాడు రాజకీయ చిత్రం ప్రధానంగా డీఎంకే-నేతృత్వంలోని కూటమి , అన్నాడీఎంకే, బీజేపీ కూటమి మధ్యే కేంద్రీకృతమైంది. విజయ్ తన పార్టీని స్థాపించినప్పటి నుండి ఎటువంటి కూటముల్లో చేరకుండా 234 నియోజకవర్గాల్లో ఒంటరిగా పోటీ చేస్తామని ప్రకటించారు. తమిళనాడు రాజకీయాల్లో గత 50 ఏళ్లుగా ఏదో ఒక ప్రధాన ద్రావిడ పార్టీతో కూటమి లేకుండా గెలవడం అసాధ్యమనేది చరిత్ర చెబు తున్న సత్యం. విజయ్ ఈ విషయాన్ని విస్మరించి, కేవలం తనకున్న స్టార్ ఇమేజ్ తోనే గట్టెక్కవచ్చని భావించడం ఆయనకు పెద్ద మైనస్ అయింది. క్షేత్రస్థాయిలో బూత్ కమిటీలు లేకపోవడం, జిల్లాల్లో బలమైన రెండో శ్రేణి నాయకత్వం కరువవ్వడం విజయ్ పార్టీని బలహీనపరుస్తోంది.విజయ్ ప్రధానంగా డీఎంకేని తన బద్ధశత్రువుగా ప్రకటించుకున్నారు.

తెలంగాణ ఆర్టీసీ ఉద్యోగులకు..

## రేవంత్ సర్కార్ తీపికబురు

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** తెలంగాణ ఆర్టీసీ ఉద్యోగులకు రేవంత్ సర్కార్ తీపికబురును అందించింది. ఈ క్యాలెండర్ సంవత్సరం (2026) నుండి 2.1% డిఏను పెంచుతున్నట్లు ప్రకటించారు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్. ఇంతకు ముందు 50.7% డిఏ ఉండగా, ఇపుడు దాన్ని 52.8%కి పెంచుతున్నట్లు తెలిపారు. పెరిగిన డిఏ జనవరి 1, 2026 నుండి అమల్లోకి వచ్చినట్లు తెలిపారు. గడిచిన మూడు నెలలకు గాను ఒక్కోనెలలో సప్లిమెంటరీ బిల్స్ ద్వారా ప్రభుత్వం చెల్లించనున్నది. పెరిగిన డీఏ ద్వారా ఆర్టీసీ పై ప్రతి నెల 2.82 కోట్ల రూపాయల అదనపు భారం పడనుంది. చివరగా జూలై 2025 లో కూడా 2.1% డిఏ పెంచిన రాష్ట్ర ప్రభుత్వం. జూలై 2025 లో 48.6% నుండి 50.7% కి పెంచారు.




- ఈ క్యాలెండర్ సంవత్సరం (2026) నుండి 2.1% డిఏ ను పెంచుతున్నట్లు ప్రకటించారు
- ఇంతకు ముందు 50.7% డిఏ ఉండగా, ఇపుడు దాన్ని 52.8% కి పెంచుతున్నట్లు తెలిపారు



హరివంశ్ నారాయణ సింగ్ కు

## మరో ఛాన్స్

- రాష్ట్రపతి కోటాలో నామినేట్ చేసిన కేంద్రం
- మరోమారు డిప్యూటి ఛైర్మన్ అయ్యే అవకాశం

న్యూఢిల్లీ, ఏప్రిల్10 : రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్‌గా హరివంశ్ నారాయణ్ సింగ్ కొనసాగే అవకాశముంది. అనుభవజ్ఞుడైన నాయకుడిగా, నిష్పక్షపాతంగా సభను నడిపించే సమర్థత కలిగిన వ్యక్తిగా ఆయనకు గుర్తింపు ఉంది. భారత పార్లమెంట్ ఎగువ సభలో అత్యంత హుందాతనం గల నేతగా పేరుగాంచిన హరివంశ్.. మరోసారి రాజ్యసభ సభ్యుడిగా కొనసాగబోతున్నారు. మాజీ ప్రధాన న్యాయమూర్తి రంజన్ గొగోయ్ పదవీ విరమణతో ఏర్పడిన ఖాళీని భర్తీ చేస్తూ, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆయనను నామినేట్ చేశారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 80 ప్రకారం.. సాహిత్యం, శాస్త్రం, కళలు, సామాజిక సేవ వంటి రంగాల్లో విశేష కృషి చేసిన 12 మందిని రాష్ట్రపతి రాజ్యసభకు నామినేట్ చేస్తారు. హరివంశ్ తనకున్న సుదీర్ఘ జర్నలిజం అనుభవం, సామాజిక స్పృహతో ఈ కోటాలో ఎంపికయ్యారు. బిహార్ నుంచి జేడీయూ తరఫున ఎన్నికైన ఆయన సభ్యత్వ కాలం ఏప్రిల్ 9వ తేదీన ముగిసింది. సాధారణంగా పార్టీ కోటాలో సభ్యత్వం ముగిసిన తర్వాత తిరిగి పార్టీ టికెట్‌పైనే వస్తుంటారు. కానీ, కేంద్ర ప్రభుత్వం ఆయన సేవలను ప్రత్యేకంగా గుర్తించి రాష్ట్రపతి కోటా ద్వారా నేరుగా సభకు పంపడం గమనార్హం. రాజ్యసభ 13వ డిప్యూటీ ఛైర్మన్‌గా ఆయన పనిచేసిన తీరు అమోఘం. క్లిష్టమైన బిల్లుల చర్చ సమయంలో సభలో గందరగోళం నెలకొన్నప్పుడు, ఆయన చూపిన ప్రతిభ, నిష్పక్షపాత నిర్ణయాలు అధికార, ప్రతిపక్షాల మన్ననలు పొందాయి.

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** హైదరాబాద్ నగరంలో శాంతిభద్రతల పరి రక్షణె ధ్యేయంగా పోలీసులు చేపట్టిన 'ఆపరేషన్ డ్రగ్ ఫ్రీ సిటీ' ఇప్పుడు పెను సంచలనం సృష్టిస్తోంది. రౌడీషీటర్ల ఆగడాలకు అడ్డుకట్ట వేసేందుకు నగర పోలీస్ కమిషనర్ సజ్జనార్ తీసుకున్న సాహసోపేత నిర్ణయం ఇప్పుడు నేరగాళ్ల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తోంది. భాగ్యనగరంలో పెరుగుతున్న నేరాలకు మత్తు పదార్థాలే కారణమని గుర్తించిన పోలీసులు, రౌడీషీటర్ల పని పట్టేందుకు సరికొత్త వ్యూహాన్ని అమలు చేస్తున్నారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా రౌడీషీటర్లను పిలిపించి వారికి డ్రగ్ కిట్స్ ద్వారా పరీక్షలు నిర్వహించడంతో విస్తుపోయే నిజాలు వెలుగు చూశాయి. సీపీ సజ్జనార్ ఆదేశాలతో రౌడీషీటర్లకు డ్రగ్ టెస్టులు నిర్వహించారు. నగరంలో ప్రస్తుతం 1,300 మందికి పైగా రౌడీషీటర్లు ఉన్నారు.



ఆపరేషన్ డ్రగ్ ఫ్రీ సిటీపై

## ఫోకస్

- రౌడీ షీటర్లకు డ్రగ్ టెస్టులతో విస్తుపోయే నిజాలు
- 75శాతం మంది రౌడీషీటర్లు గంజాయి బానిసలుగా గుర్తింపు

# జిల్లా కోర్టుల్లో స్పెషల్ మేజిస్ట్రేట్ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 10, (తెలంగాణ దిశ)** :మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా జడ్జి యూనిట్‌లో మార్నింగ్ కోర్టులకు అధ్యక్షత వహించేందుకు స్పెషల్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్, సెకండ్ క్లాస్ స్పెషల్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ పోస్టుల భర్తీకి ప్రిన్సిపల్ జిల్లా మరియు సెషన్ జడ్జి కార్యాలయం దరఖాస్తులను ఆహ్వానించింది. ఎంపికైన అభ్యర్థులు వారానికి ఐదు రోజులు (సోమవారం నుంచి శుక్రవారం వరకు) ఉదయం 7.30 గంటల నుంచి 10.30 గంటల వరకు మార్నింగ్ కోర్టులను నిర్వహించాల్సి ఉంటుందని తెలిపారు. వారికి నెలకు రూ.45 వేల గౌరవ వేతనం, అదనంగా రూ.5,000 ప్రయాణ భత్యం చెల్లించబడుతుందని పేర్కొన్నారు. ఈ నియామకానికి పదవీకాలం ఒక సంవత్సరం ఉంటుందని వెల్లడించారు. అర్హులైన అభ్యర్థులు నోటిఫికేషన్, నిర్దేశిత దరఖాస్తు ఫారమ్‌ను జిల్లా కోర్టుల అధికారిక వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని, పూర్తి వివరాలతో పాటు అవసరమైన పత్రాలను జత చేసి రెండు ప్రతులుగా ఈ నెల 17న సాయంత్రం 5 గంటలలోపు మల్కాజిగిరి (కుషాయిగూడ)లోని ప్రిన్సిపల్ జిల్లా, సెషన్ జడ్జి కార్యాలయానికి సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. గడువు తర్వాత అందిన లేదా అసంపూర్ణ దరఖాస్తులు పరిగణనలోకి తీసుకోబడవని స్పష్టం చేశారు. అభ్యర్థుల అర్హతల విషయానికి వస్తే, న్యాయ సేవల్లో పనిచేసి పదవీ విరమణ పొందిన వారు, జ్యుడిషియల్ మినిస్టీరియల్ సర్వీసులో హెడ్ క్లర్క్ స్థాయి లేదా అంతకంటే పై హోదాలో పని చేసి లా డిగ్రీ కలిగిన వారు, హైకోర్టు సర్వీసుల్లో సెక్షన్ ఆఫీసర్ స్థాయి లేదా అంతకంటే పై హోదాలో పనిచేసిన వారు, కనీసం ఐదు సంవత్సరాల అనుభవం కలిగిన 45 సంవత్సరాల పైబడిన న్యాయవాదులు లేదా మేజిస్టీరియల్ అధికారాలు వినియోగించిన విశ్రాంత గెజిటెడ్ అధికారులు అర్హులుగా పేర్కొన్నారు. పదవీ విరమణ పొందిన న్యాయాధికారులకు ప్రాధాన్యత ఇవ్వబడుతుందని తెలిపారు. ఇక ప్రాక్టీసింగ్ అడ్వకేట్లు, ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ సేవల నుంచి శిక్షలతో తొలగించబడిన వారు, నైతిక నేరాల్లో దోషులైన వారు, దివాలాదారులు, ప్రభుత్వ కాంట్రాక్టులు నిర్వహిస్తున్న వ్యక్తులు ఈ పోస్టులకు అర్హులు కారని పేర్కొన్నారు. ఎంపికైన స్పెషల్ మేజిస్ట్రేట్‌లు విధుల్లో నిర్లక్ష్యం ప్రదర్శించిన పక్షంలో లేదా వరుసగా మూడు కోర్టు సిట్టింగ్స్‌కు హాజరు కాకపోతే వారి




అధికారాలను రద్దు చేసే అవకాశముందని తెలిపారు. అలాగే 65 సంవత్సరాల వయస్సు పూర్తయిన వెంటనే వారు స్వయంచాలకంగా పదవి నుంచి తప్పుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. నియామక ప్రక్రియలో భాగంగా అభ్యర్థులకు ఎలాంటి ప్రయాణ భత్యం చెల్లించబడదని, అవసరమైతే నోటిఫికేషన్‌ను ఎటువంటి కారణం చెప్పకుండా రద్దు చేసే హక్కు నియామకాధికారికి ఉంటుందని ప్రకటనలో పేర్కొన్నారు.

## ప్రభుత్వ భూములను కాపాడాలి : బీజేపీ



**కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 10, (తెలంగాణ దిశ)** :బాచుపల్లి మండలం నిజాంపేట సర్కిల్ పరిధిలో ప్రభుత్వ భూములను కాపాడాలని కోరుతూ భారతీయ జనతా పార్టీ నేతలు కోరారు. ఈ మేరకు పార్టీ మేడ్చల్ జిల్లా అర్బన్ ఇంచార్జీ అధ్యక్షుడు డాక్టర్ ఎస్ మల్లారెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా అదనపు విజయేందర్ రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ప్రభుత్వ భూముల్లో మినీ స్టేడియం, 100 పడకల ఆసుపత్రి నిర్మించాలని కోరారు. నిజాంపేట ప్రాంతంలో వందల ఎకరాల ప్రభుత్వ భూములు ఇప్పటికే అక్రమణలకు గురయ్యాయని ఆరోపించారు. ప్రత్యేకంగా 14 ఎకరాలకు పైగా లావణ్య పట్టా భూమి కూడా కబ్జాలకు గురవుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు బిక్షపతి యాదవ్, శ్రీనివాస్ గుప్తా, ఎన్ ఆర్ కే ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు వరం సిఎంఆర్ఎఫ్ పథకం

**- సిఎంఆర్ఎఫ్ ఎల్ఓసి చెక్కుల పంపిణీ**

**-- కూన శ్రీనివాస్ గౌడ్**





**కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 10, (తెలంగాణ దిశ)** :ముఖ్యమంత్రి సహాయనిధి ఎల్ఓసిచెక్కులను శుక్రవారం కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఉపాధ్యక్షులు కూన శ్రీనివాస్ గౌడ్ మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు రాజనోళ్ల లక్ష్మితో కలిసి అర్హులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం ద్వారా అనారోగ్యంతో బాధపడుతున్న పలువురు లబ్ధిదారులకు ఆర్థిక సహాయం అందింది. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఎన్ఎల్బి నగర్‌కు చెందిన కిషోర్ కుమార్‌కు రూ.2.50 లక్షల ఎల్ఓసి అందజేశారు. అదే విధంగా యాస్మిన్‌బేగం, వక్క సునీత, అడక్కని సోని, జెషితలకు చికిత్స ఖర్చుల నిమిత్తం రూ.2 లక్షల సిఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. మొత్తం రూ.4.50 లక్షల విలువైన ఆర్థిక సహాయాన్ని ఈ సందర్భంగా అందజేశారు. ఈ సందర్భంగా కూన శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయనిధి పేద, మధ్యతరగతి ప్రజలకు అనారోగ్య సమయంలో ఆర్థికంగా ఎంతో తోడ్పడే గొప్ప పథకమని తెలిపారు. నియోజకవర్గ పరిధిలో అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందిన వారు సంబంధిత రసీదులను సమర్పించి ఈ సహాయాన్ని పొందాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమలు చేస్తున్న ప్రజా పాలన సంక్షేమ పథకాలు అర్హులందరికీ చేరేలా కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, జిల్లా ఇంచార్జీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ నేతలు లక్ష్మీ, నారాయణమ్మ, కాంగ్రెస్ పార్టీ మాజీ ప్రజా ప్రతినిధులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

**- పిహెచ్ సిని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్**





మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 10, (తెలంగాణ దిశ) :ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు ఆరోగ్య కేంద్రాల్లో అవసరమైన మౌలిక సదుపాయాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ మను చౌదరి తెలిపారు. శుక్రవారం కూకట్‌పల్లి ఎల్లమ్మబండలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రోజువారీ ఓపి సంఖ్య, ఆసుపత్రిలో ఉన్న సదుపాయాలపై వైద్యాధికారిని అడిగి తెలుసుకున్నారు. కేంద్రంలో ఆశా వర్కర్ల కొరత ఉందని మెడికల్ ఆఫీసర్ వివరించగా, అవసరమైన సిబ్బంది ఏర్పాటుపై చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆసుపత్రికి అదనపు గదులు, టాయిలెట్లు అవసరమని అధికారులు వినతిపత్రం సమర్పించగా, మరమ్మత్తులు, కొత్త నిర్మాణాలకు సంబంధించి అంచనాలు సిద్ధం చేసి ప్రతిపాదనలు పంపాలని కలెక్టర్ ఆదేశించారు. ఫార్మసిస్ట్‌కు ఔషధాల నిల్వలను సమర్థంగా నిర్వహించాలని కోరారు. ఎమర్జెన్సీ కార్నర్‌ను ఎప్పటికప్పుడు సిద్ధంగా ఉంచాలని సూచించారు. రోగులకు మందులు ఇచ్చేటప్పుడు ఎక్స్‌పైరీ తేదీలను తప్పనిసరిగా పరిశీలించాలని స్పష్టం చేశారు. అనంతరం ఆసుపత్రి రిజిస్టర్లను పరిశీలించి, వ్యాక్సినేషన్ మరియు ఇమ్యునైజేషన్ కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. ఆసుపత్రి అభివృద్ధికి అవసరమైన నిధులను సమకూర్చుతామని కలెక్టర్ హామీ ఇచ్చారు.

# కొత్త సీసీ రోడ్డు...., నిర్మాణం అస్తవ్యస్తం

**- అధికారులు నిర్లక్ష్యం... ప్రజల పట్ల శాపం - ప్రారంభంలోనే పగుళ్లు... నాసిరకం పనులపై అనుమానాలు - భారీ వాహనాల రాకపోకలతో ప్రమాదం మరింత తీవ్రం**

**- వెంటనే స్పందించకపోతే పెద్ద ప్రమాదం తప్పదని హెచ్చరిక**





**కాప్రా, ఏప్రిల్ 10, (తెలంగాణ దిశ)** :కాప్రా ఎమ్మార్వో కార్యాలయం నుండి ఎల్లారెడ్డి గూడకు వెళ్లే ప్రధాన రహదారిపై ఇటీవల నిర్మించిన సీసీ రోడ్డు ప్రారంభంలోనే బీటలు వారడం తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. నిర్మాణం పూర్తయిన కొద్ది రోజులకే రోడ్డు మధ్యలో పెద్ద పగుళ్లు ఏర్పడి కాంక్రీట్ పలకలు పైకి లేచిన దృశ్యాలు నిర్మాణ నాణ్యతపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. ఈ రహదారి మీద రోజూ భారీ వాహనాలు, ట్రక్కులు నిరంతరం ప్రయాణిస్తున్నాయి. దీంతో ఇప్పటికే దెబ్బతిన్న రోడ్డు ఎప్పుడైనా పూర్తిగా కూలిపోయే ప్రమాదం ఉందని స్థానికులు తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రాణాలకు ముప్పు పొంచి ఉన్నా సంబంధిత అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు మాత్రం కనీసం పరిశీలనకైనా రాకపోవడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. పనులు పూర్తయ్యాక కూడా పర్యవేక్షణ లేకపోవడం వల్లే ఈ పరిస్థితి వచ్చింది. ఇప్పటికైనా స్పందించకపోతే పెద్ద ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిది? అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు వెంటనే స్పందించి రహదారిని మరమ్మతు చేయడంతో పాటు భారీ వాహనాల రాకపోకలను తక్షణమే నిలిపివేయాలని, ట్రాఫిక్‌ను ఇతర మార్గాలకు మళ్లించాలని స్థానికులు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు. లేకపోతే ఆందోళన కార్యక్రమాలకు దిగుతామని హెచ్చరిస్తున్నారు.

# కుత్బుల్లాపూర్‌లో బీజేపీ సంకల్ప యాత్ర ప్రారంభం

**కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 10, తెలంగాణ దిశ)**:కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ సెల్ కో కన్వీనర్ రావుల శేషగిరి ఆధ్వర్యంలో బీజేపీ సంకల్ప యాత్ర, గడప గడపకు బీజేపీ కార్యక్రమం ఘనంగా ప్రారంభమైంది. కైసర్ నగర్ నుంచి ప్రారంభమైన ఈ యాత్ర ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకోవడం, కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించడం లక్ష్యంగా కొనసాగుతుంది. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికీ వెళ్లి ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. అలాగే కేంద్ర ప్రభుత్వ విజయాలను ప్రతిబింబించే కరపత్రాలను ప్రజలకు అందజేశారు. రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని బీజేపీ క్యాడర్‌ను ఉత్సాహ పరచడం, కొత్త సభ్యులను చేర్చుకోవడం కూడా ఈ యాత్ర ముఖ్య ఉద్దేశ్యంగా ఉంది. ఈ సంకల్ప యాత్ర ద్వారా బీజేపీ నాయకుడు రావుల శేషగిరి పార్టీని ప్రజలకు మరింత చేరువ చేస్తూ, నియోజకవర్గంలో పార్టీ బలాన్ని పెంచే దిశగా కృషి చేస్తున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా



అధ్యక్షులు మల్లారెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జయశ్రీ, రాష్ట్ర ఓబీసీ మోర్చా మహంకాళి జిల్లా ఇంచార్జి నందనం దివాకర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బక్క శంకర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి గిరి వర్ధన్ రెడ్డి, జె.కె. శేఖర్ యాదవ్, బాచుపల్లి మాజీ కార్పొరేటర్ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రకృతి సోయగాల నడుమ సలేశ్వరం జాతర



**నాగర్ కర్నూల్,తెలంగాణ దిశ:** నల్లమల అటవీ ప్రాంతంలో క్షేత్రస్థాయిలోపర్యటించి జాతర ఏర్పాట్లను స్వయంగా జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ పరిశీలించారు. సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజక వర్గం పరిధిలోని లింగాల మండలంలోని సుందరమైన నల్లమల అడవులు మధ్య వెలసిన ప్రసిద్ధ పుణ్యక్షేత్రం సలేశ్వరం లింగమయ్య స్వామి జాతర ఉదయం భక్తి శ్రద్ధల మధ్య ఘనంగా ప్రారంభమైం దన్నారు. ప్రతి సంవత్సరం జరిగే ఈ జాతరకు తెలంగాణతో పాటు పక్క రాష్ట్రాల నుంచి కూడా వేలాది మంది భక్తులు తరలి వస్తుండటం విశేషం. ప్రకృతి సోయగాల నడుమ జరిగే ఈ జాతర భక్తులకుఆధ్యాత్మిక ఆనందాన్ని పంచుతుందన్నారు. మూడు రోజుల పాటు కొనసాగే ఈ మహోత్సవాన్ని దృష్టిలో ఉంచుకుని జిల్లా యంత్రాంగం ముందస్తుగా విస్తృత ఏర్పాట్లు చేపట్టిందని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పని చేస్తుందన్నారు. ముఖ్యంగా తాగునీటి సరఫరా, అన్నదానం, విశ్రాంతి మండపాలు, తాత్కాలిక నివాస సదుపాయా లు వంటి అంశాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. ఏర్పాట్లపై భక్తులతో కలెక్టర్ ఆరా తీశారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఏర్పాటు చేసిన క్యూలైన్లు, పార్కింగ్ ప్రాంతాలు, ట్రాఫిక్ నియంత్రణ చర్యలను వారు సమీక్షించారు. అలాగే సీసీ కెమెరాల ద్వారా నిఘా వ్యవస్థను బలోపేతం చేసి భద్రతను మరింత కట్టుదిట్టం చేశామని, వైద్య సేవల పరంగా కూడా ప్రత్యేక ఏర్పాట్లు చేయబడినట్లు అధికారులు తెలిపారు.

అడవి ప్రాంతం కావడంతో అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రత్యేక బృందాలను సిద్ధంగా ఉంచినట్లు, ఏమన్నా ఇబ్బందులు ఉంటే తెలపాలని కలెక్టర్ భక్తులను కోరారు. భక్తులు సురక్షితంగా సౌకర్య వంతంగా జాతరలో పాల్గొనేలా అన్ని చర్యలు తీసుకుంటున్నారు. జాతర మూడు రోజుల పాటు అధికారులు 24 గంటలు పర్యవేక్షణ కొనసాగిస్తారని, ఎలాంటి సమస్యలు తలెత్తినా వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

జిల్లా ఎస్పీ కూడా పోలీస్ సిబ్బందికి పలు సూచనలు చేస్తూ, ట్రాఫిక్ నియంత్రణ పై ప్రత్యేక దృష్టి పెట్టాలని, భక్తుల రద్దీ ఉన్న ప్రాంతాల్లో అప్రమత్తంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. భద్రత పరంగా ఎటువంటి లోపాలు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ తెలిపారు.

# తెలంగాణలో భక్తి ఫైట్..!

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** తెలంగాణ రాజకీయాలు ఇప్పుడు ఏ లెవల్‌కు వెళ్లాయంటే.. రేపు పొద్దున ఓటర్లు కూడా ఓటు వేసే ముందు ఏ దేవుడిని నమ్ముతున్నారో చూసుకుని బటన్ నొక్కాల్సి వస్తుందేమో! గత పదేళ్లుగా మన రాష్ట్రాన్ని ఏలిన "వైష్ణవ ప్రియుడు" కేసీఆర్ గారు యాదాద్రిలో నరసింహస్వామిని కోట్లు ఖర్చు పెట్టి కోవెల కట్టిస్తే.. ఇప్పుడు వచ్చిన మన "శివ భక్త" రేవంత్ రెడ్డి గారు మాత్రం "మీరు చక్రం తిప్పితే.. నేను త్రిశూలం తిప్పుతా" అంటూ శైవ నామాలతో రంగంలోకి దిగారు.ఇన్నాళ్లూ కేసీఆర్ గారు చినజీయర్ స్వామి సూచనలతో, ఆగమ శాస్త్రాల లెక్కలతో.. ఎక్కడ చూసినా 'గోవిందా గోవిందా' అనిపించారు. కానీ భద్రాచలం రామయ్యను మాత్రం ఎందుకో కాస్త లైట్ తీసుకున్నారు. అక్కడే మన రేవంత్ అన్నకు రూట్ దొరికింది. "కేసీఆర్ గారు రాముడిని మర్చిపోతే.. నేను రాముడికి పట్టువస్త్రాలు ఇస్తూనే, శివుడితో సెల్ఫీలు దిగుతా" అన్నట్లుగా ఆయన ప్లాన్ మార్చేశారు.ఢిల్లీలో రాహుల్ గాంధీ గారు అప్పుడప్పుడు "నేను శివ భక్తుడిని" అని ఫోజులు ఇస్తుంటే ఇక్కడ రేవంత్ రెడ్డి గారు ఆ లైన్ గట్టిగా పట్టేశారు. కేసీఆర్ వేములవాడ రాజన్నకు రూ. 100 కోట్లు ఇస్తానని చెప్పి 'సారీ.. మర్చిపోయా' అంటే.. రేవంత్ రెడ్డి గారు మాత్రం "రాజన్నకు నిధులిస్తా.. మూసీ గట్టున వంద అడుగుల శివుడిని నిలబెడతా" అని శివతాండవం చేస్తున్నారు. మొత్తానికి పాత పాలనలో 'విష్ణువు' హైలైట్ అయితే కొత్త పాలనలో 'పరమశివుడు' ట్రెండింగ్‌లో ఉన్నారన్నమాట!అసలు ఇక్కడ డౌట్ ఏంటంటే.. వీరికి భక్తి పెరిగిందా? లేక దేవుళ్లని కూడా విభజించి ఓట్లు దండుకోవాలని ఉందా? కేసీఆర్ మార్క్ భారీ గోపురాలు, శిల్ప కళలు, వైష్ణవ ఆడంబరం కనిపిస్తోంది. ఇక రేవంత్ మార్క్ సాదాసీదా శివ భక్తి, శైవ క్షేత్రాల డెవలప్‌మెంట్, మరొకరు నిప్పు కన్ను తెరుస్తానని హింట్లు ఇస్తున్నారు. కానీ పాపం జనం మాత్రం.. "అయ్యా..

మీరు వైష్ణవమో, శైవమో మాకు అనవసరం.. మాకు కొంచెం వర్షాలు కురిపించి, రోడ్లు వేయించి, మా బతుకులు బాగు చేస్తే ఏ దేవుడైనా ఒక్కటే!" అని ముక్కున వేలేసుకుంటున్నారు.రాజకీయ నాయకుల భక్తి ఎప్పుడూ 'సీజనల్' వ్యాధి లాంటిదే. ఎన్నికలప్పుడు గుళ్లు తిరగడం కామన్, కానీ ఇలా 'శాఖల' వారీగా దేవుళ్లను పంచుకోవడం మాత్రం విచిత్రం. కేసీఆర్ గారు వైష్ణవంతో 'మోక్షం' పొందాలనుకుంటే, రేవంత్ రెడ్డి గారు శైవంతో 'శక్తి'ని ప్రదర్శిస్తున్నారు. రేపు ఇంకెవరైనా వచ్చి "మేము శాక్తేయులం" అని అమ్మవారిని పట్టుకొస్తారో ఏమో!చివరికి ఏ దేవుడు కరుణిస్తాడో కానీ.. తెలంగాణ ఓటర్లు మాత్రం ఈ "ఆధ్యాత్మిక వార్" చూసి తెగ ఎంజాయ్ చేస్తున్నారు!

# పగటి పూట వెలుగుతున్న వీధి దీపాలు..! గ్రామస్తులు కీలక విజ్ఞప్తి

**గంగాధర,తెలంగాణ దిశ :** గంగాధర మండల కేంద్రంలో పగటి పూట కూడా వీధి దీపాలు వెలుగుతూ ఉండటంతో విద్యుత్ వృథా అవుతున్న పరిస్థితి స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. ఒకవైపు వేసవి తీవ్రత రోజురోజుకు పెరుగుతుండగా, మరోవైపు విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఎదురవుతున్న తరుణంలో ఇలా పగటి వేళల్లోనే వీధి దీపాలు వెలుగుతూ ఉండటం ప్రజల్లో ఆగ్రహాన్ని కలిగిస్తోంది. గంగాధర గ్రామంలోని గంగాధర బ్లాక్ నుండి గంగాధర ఎక్స్ రోడ్డుకు వెళ్లే ప్రధాన రహదారి వెంట ఏర్పాటు చేసిన వీధి దీపాలతో పాటు ఐమ్యాక్స్ లైట్లు కూడా పగటి సమయంలోనే వెలుగుతూ కనిపించాయి. ఈ కారణంగా అవసరం లేని సమయంలో విద్యుత్ వినియోగం పెరిగి ప్రజా ధనం వృథా అవుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో గ్రామాల్లో విద్యుత్ వినియోగం అధికమవుతోంది. ఇలాంటి సమయంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే



విద్యుత్ కొరత సమస్యలు మరింత తీవ్రం కావచ్చని ప్రజలు అంటున్నారు. ఈ ఘటనపై సంబంధిత పంచాయతీ, విద్యుత్ శాఖ అధికారులు తక్షణమే స్పందించి పగటి పూట వెలుగుతున్న వీధి దీపాల విద్యుత్ లైన్‌లను పరిశీలించి సరిచేయాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. ప్రజా ధనం వృథా కాకుండా సమయానుకూలంగా పర్యవేక్షణ చర్యలు చేపట్టడం అధికారుల బాధ్యత అని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

# సంపాదకీయం

## ఐదు గ్యారంటీలు గట్టెక్కిస్తాయా..?


ఆరు గ్యారంటీలు ఇచ్చి తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు ఇదే తరహా వ్యూహాన్ని కేరళంలోనూ అమలు చేస్తోంది. మలయాళీలకు ఐదు గ్యారంటీలను హస్తం పార్టీ ఆఫర్ చేస్తోంది. తెలంగాణ తరహాలోనే మహిళలకు ఉచిత బస్సు పథకాన్ని అమలు చేస్తామని కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. అయితే అక్కడి బడ్జెట్ పరిమితులు, ప్రజల ఆలోచనా విధానాన్ని దృష్టిలో ఉంచుకొని మిగతా హామీల అమలు విషయంలో హస్తం పార్టీ ఆచితూచి వ్యవహరించింది.ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా.. ఏప్రిల్ 9న కేరళం అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. పోలింగ్‌కు కొద్ది రోజులే గడువు ఉండటంతో ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. ఈసారి కేరళంలో బీజేపీ కూడా బలంగా ప్రచారం చేస్తోంది. దీంతో కొన్ని నియోజకవర్గాల్లో త్రిముఖ పోరు ఉండే అవకాశం ఉంది. అయితే చాలా చోట్ల మాత్రం పోటీ ప్రధానంగా అధికార ఎల్డీఎఫ్, ప్రతిపక్ష కాంగ్రెస్ కూటమి యూడీఎఫ్ మధ్యే ఉండే అవకాశం ఉంటుందని అంచనా. గత పదేళ్లుగా కేరళలో అధికారంలో ఉన్న ఎల్డీఎఫ్ హ్యాట్రిక్ కొట్టాలని భావిస్తుండగా.. ఈసారి ఎలాగైనా మలయాళీల మనసు గెలవాలని హస్తం పార్టీ పట్టుదలతో ఉంది.తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో ఆరు గ్యారంటీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన హస్తం పార్టీ.. ఇప్పుడు మలయాళ గడ్డ మీద పాగా వేయడం కోసం ఐదు గ్యారంటీలను సిద్ధం చేసింది. మహిళలు, యువతను తమవైపు తిప్పుకోవడమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ ఈ హామీలను ఇచ్చింది.మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకాన్ని కేరళంలోనూ అమలు చేస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. ఇప్పటికే కర్ణాటక, తెలంగాణల్లో ఈ పథకాన్ని కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంగతి తెలిసిందే.కాలేజీలకు వెళ్తున్న అమ్మాయిలకు నెలకు రూ.1000 చొప్పున ఆర్థిక సాయం చేస్తామని కేరళంలో కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. తెలంగాణలో ప్రతి మహిళకు నెలకు రూ.2500 చొప్పున ఆర్థిక సాయం చేస్తామని ఎన్నికల ముంగిట కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. ఈ హామీ తెలంగాణలో ఇంకా అమలు కాలేదు. దీంతో కేరళంలో ఈ హామీని మార్చారని భావించొచ్చు.కేరళలో ప్రస్తుతం నెలకు రూ.2 వేల చొప్పున పెన్షన్లు ఇస్తుండగా.. దాన్ని రూ. 3 వేలకు పెంచుతామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. తెలంగాణలో ఫించన్లను రూ.4 వేలకు పెంచుతామని ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. అయితే ఈ హామీ కూడా ఇంకా అమలు చేయలేదు.ప్రతి కుటుంబానికి రూ.25 లక్షల ఆరోగ్య బీమాను అందిస్తామని కేరళ కాంగ్రెస్ హామీ ఇచ్చింది. ఈ పథకానికి కేరళ మాజీ సీఎం ఉమెన్ చాందీ పేరు పెడతామని ఆ పార్టీ ప్రకటించింది. తెలంగాణలో రేవంత్ రెడ్డి సర్కారు ఆరోగ్య శ్రీ పరిధిని రూ.10 లక్షలకు పెంచిన సంగతి తెలిసిందే.యువత వ్యాపారాలు చేసుకోవడానికి వీలుగా చిన్న వ్యాపారాల కోసం రూ. 5 లక్షల వరకు వడ్డీ లేని రుణాలు ఇస్తామని కేరళ కాంగ్రెస్ హామీ ఇచ్చింది. వృద్ధుల సంక్షేమాన్ని పర్యవేక్షించడం కోసం ప్రత్యేకమైన మంత్రిని నియమిస్తామని కేరళ కాంగ్రెస్ ప్రకటించింది. రబ్బరు సాగు చేసే రైతులను ఆకట్టుకోవడం కోసం కిలో రబ్బరుకు రూ.250 చెల్లిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది.రైతులకు అందించే పెట్టుబడి సాయాన్ని ఎకరానికి ఏడాదికి రూ.10 వేల నుంచి రూ.16 వేలకు పెంచుతామని కాంగ్రెస్ పార్టీ 2023 అసెంబ్లీ ఎన్నికల ముంగిట హామీ ఇచ్చింది. అలాగే వ్యవసాయ కూలీలకు ఏడాదికి రూ.12 వేలు ఇస్తామని, వరికి క్వింటాల్‌కు రూ.500 చొప్పున బోనస్ ఇస్తామని హస్తం పార్టీ హామీ ఇచ్చింది. అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత పెట్టుబడి సాయం 'రైతు భరోసా'ను ఎకరానికి రూ.12 వేలకు మాత్రమే పెంచింది. రూ.2 లక్షల లోపు పంట రుణాలు మాఫీ చేస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. ఈ హామీని దాదాపుగా నెరవేర్చింది.ఇందిరమ్మ ఇండ్లు పేరిట సొంత స్థలం ఉన్న పేదలు ఇల్లు కట్టుకోవడానికి రూ.5 లక్షల ఆర్థిక సాయం చేస్తామని, గృహ జ్యోతి కింద ప్రతి కుటుంబానికి నెలకు 200 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్ అందిస్తామని తెలంగాణ ఎన్నికల ముంగిట హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ ఈ హామీలను అమలు చేస్తోంది. అలాగే పేద కుటుంబాలకు రూ.500కే వంట గ్యాస్ సిలిండర్ అందిస్తామని తెలంగాణలో హస్తం పార్టీ హామీ ఇచ్చింది.యువ వికాసం కింద విద్యార్థులకు ఉన్నత చదువుల కోసం రూ.5 లక్షల వరకు సాయం చేస్తామని.. ప్రతి మండలంలో తెలంగాణ ఇంటర్నేషనల్ స్కూల్స్ ఏర్పాటు చేస్తామని తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది.మహిళలను ఆకట్టుకోవడానికి కాంగ్రెస్ పార్టీ ఉచిత బస్సు ప్రయాణం హామీని ఈ రెండు రాష్ట్రాల్లోనూ ఇచ్చింది. రైతుల కోసం తెలంగాణలో పెట్టుబడి సాయాన్ని భారీగా పెంచుతామని హామీ ఇచ్చింది. కానీ ఆ స్థాయిలో పెంచలేకపోయింది. అలాగే తెలంగాణలో మహిళలందరికీ రూ.2500 చొప్పున ప్రతినెలా ఆర్థిక సాయం చేస్తామని హామీ ఇచ్చినప్పటికీ.. ఇంకా అమలు కాలేదు. దీంతో కేరళంలో కాలేజీకి వెళ్లే అమ్మాయిలకు నెలకు వెయ్యి రూపాయల చొప్పున సాయం చేస్తామని హామీ ఇచ్చింది.ఆరోగ్య బీమా విషయంలో మాత్రం తెలంగాణ కంటే మెరుగ్గా కేరళంలో హామీ ఇచ్చింది. తెలంగాణకు వచ్చే ఆదాయం ఎక్కువ, ఇక్కడి బడ్జెట్ ఎక్కువ. సంక్షేమ పథకాలకు ఇక్కడ ప్రాధాన్యం ఎక్కువ. దీంతో సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తూ తెలంగాణలో కాంగ్రెస్ హామీలు ఇచ్చింది.2026-27 తెలంగాణ బడ్జెట్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల అమలుకే రూ.50 వేల కోట్లకుపైగా కేటాయించింది.కానీ కేరళం విషయానికి వస్తే.. ఆ రాష్ట్ర ఆదాయం తెలంగాణతో పోలిస్తే తక్కువ. అక్కడి ప్రజలు బాగా చదువుకున్నవారు. ఇప్పుడు అక్కడున్న ఉచిత పథకాలు కూడా తెలంగాణ స్థాయిలో లేవు. దీంతో అక్కడి పరిస్థితులకు తగ్గట్టుగా, మలయాళీలను ఆకట్టుకునేలా హామీలు ఇచ్చింది.

# చీర్యాల లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం అష్టాదశ బ్రహ్మోత్సవాలకు సర్వాంగ సన్నద్ధం

## 12 నుండి 15 వరకు బ్రహ్మోత్సవాలు







**కీసర, ఏప్రిల్ 10, (తెలంగాణ దిశ) :** చీర్యాల గ్రామంలోని శ్రీశ్రీశ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం అష్టాదశ (18వ) వార్షిక బ్రహ్మోత్సవాలకు సర్వాంగ సన్నద్ధమైంది. ప్రతి ఏడాది భక్తి శ్రద్ధలతో నిర్వహించే ఈ మహోత్సవాలు ఈ సంవత్సరం ఏప్రిల్ 12 నుండి 15 వరకు అంగరంగ వైభవంగా జరగనున్నాయి. ఈ వేడుకలు ఏప్రిల్ 12న సాయంత్రం 5 గంటలకు ఆలయ ఫౌండర్, చైర్మన్ మల్లారపు లక్ష్మీనారాయణ నివాసం నుండి ఊరేగింపుతో ప్రారంభం కానున్నాయి. చీర్యాల గ్రామమంతా స్వామివారి ఊరేగింపు పూర్తయిన తర్వాత ఆలయానికి చేరుకుంటుంది. ఏప్రిల్ 13న పంచామృత నవకళశాభిషేకం, విశ్వక్సేన పూజ, పుణ్యావచనం, రక్షాబంధనం, అఖండ జ్యోతి స్థాపన, అంకురార్పణ, అగ్ని ప్రతిష్ట, సుదర్శన నరసింహ యాగం వంటి విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఏప్రిల్ 14న ఉదయం 10 గంటలకు యాదగిరిగుట్టకు చెందిన రిటైర్డ్ ప్రధానార్చకులు నల్లందిగులు నృసింహ చార్యుల ఆధ్వర్యంలో మల్లారపు లక్ష్మీనారాయణ చేతుల మీదుగా తిరుకళ్యాణ మహోత్సవం వేద మంత్రోచ్ఛారణల నడుమ ఘనంగా జరుగనుంది. ఏప్రిల్ 15న మహాపూర్ణాహుతి, శతఘటాభిషేకం, అలంకరణ, పంచహారతులు, చక్రస్నానం కార్యక్రమాలతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి. మూడు రోజుల పాటు శ్రీ చీర్యాల లక్ష్మీనరసింహస్వామి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో భక్తులకు మూడు పూటల నిత్య అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నారు. ప్రతి రోజు సాంస్కృతిక కార్యక్రమాలు కూడా ఏర్పాటు చేశారు. వేసవి సెలవులు నేపథ్యంలో ఈ సంవత్సరం భక్తులు భారీగా విచ్చేసే అవకాశం ఉన్నదని ఆలయ కమిటీ అంచనా వేస్తోంది. భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ ప్రత్యేక బస్సు సౌకర్యాన్ని ఏర్పాటు చేసింది. 241జ నంబర్ బస్సు చీర్యాల టెంపుల్ నుండి సికింద్రాబాద్ స్టేషన్ వరకు రోజుకు ఆరు ట్రిప్పులు నడపనున్నారు. అలాగే తిరుగు ప్రయాణానికి కూడా అనుకూల సమయాల్లో బస్సులు అందుబాటులో ఉంటాయి. అదనంగా మంచినీటి సౌకర్యం, చలువ పందిర్లు, కేర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంప్, ఈసీఐఎల్ సోలిస్ హాస్పిటల్ తరఫున ఉచిత మజ్జిగ పంపిణీ వంటి సేవలను ఏర్పాటు చేసినట్లు ఆలయ ఫౌండర్, చైర్మన్ మల్లారపు లక్ష్మీనారాయణ తెలిపారు.

### ప్రముఖులకు బ్రహ్మోత్సవాల ఆహ్వానాలు

చీర్యాల శ్రీశ్రీశ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం అష్టాదశ (18వ) వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయ ఫౌండర్, చైర్మన్ మల్లారపు లక్ష్మీనారాయణ ప్రముఖులను ఆహ్వానించారు. ఈ బ్రహ్మోత్సవాలు ఏప్రిల్ 12 నుండి 15 వరకు వైభవంగా జరగనున్న నేపథ్యంలో వివిధ రంగాలకు చెందిన ప్రముఖులకు ఆహ్వాన పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ,



రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డిలకు ప్రత్యేక ఆహ్వానం అందజేశారు. అలాగే ఐఏఎస్ అధికారి నవీన్ మిట్టల్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి, అడిషనల్ కలెక్టర్ విజయేందర్ రెడ్డిలను కూడా ఆహ్వానించారు. రాజకీయ నాయకుల్లో మాజీ మంత్రి, ఎమ్మెల్యే మల్లారెడ్డి, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, మాజీ మంత్రి ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి, రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డిలకు ఆహ్వానాలు అందజేశారు. ఇంకా మేడ్చల్ డిసిసి అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు నక్క ప్రభాకర్ గౌడ్, తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచంద్రరావు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు సింగిరెడ్డి హరి వర్ధన్ రెడ్డి తదితర ప్రముఖులకు కూడా ఆహ్వానాలు అందజేశారు. ఈ బ్రహ్మోత్సవాల్లో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని ఆలయ చైర్మన్ మల్లారపు లక్ష్మీనారాయణ భక్తులను ప్రజాప్రతినిధులను ఆహ్వానించారు.

# కాంగ్రెస్ పార్టీని మరింత పటిష్ట పరచాలి

## - టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్

### కాంగ్రెస్ పార్టీ ఏఎస్ రావునగర్ డివిజన్ అధ్యక్షులు కేశెట్టి ప్రసాద్ కు టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ సూచన





**ఏఎస్ రావునగర్, ఏప్రిల్ 10, (తెలంగాణ దిశ) :** కాంగ్రెస్ పార్టీని బూత్ స్థాయి నుంచి మరింత పటిష్ట పరచాలని టిపిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ సూచించారు. శుక్రవారం కాంగ్రెస్ పార్టీ ఏఎస్ రావునగర్ డివిజన్ అధ్యక్షులు కేశెట్టి ప్రసాద్ హోటల్ తాజ్ క్రిష్ణలో బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ను మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను అర్హులైన పేద ప్రజలకు అందజేసే విధంగా కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా కేశెట్టి ప్రసాద్ మాట్లాడుతూ ఏఎస్ రావునగర్ డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపడుతున్న పలు కార్యక్రమాలను మహేష్ కుమార్ గౌడ్ కు వివరించారు. పార్టీ నియోజకవర్గ ఇంచార్జీ మందుముల పరమేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ శ్రేణుల సహకారంతో ప్రజల మధ్య విస్తృతంగా పర్యటిస్తూ సమస్యలను తెలుసుకుంటున్నామని వివరించారు. స్థానిక ప్రజలతో నిత్యం మమేకమవుతూ వారి సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తున్నామని అన్నారు. ముఖ్యంగా డివిజన్ పరిధిలో తాగునీరు, డ్రైనేజీ, రోడ్లు, స్ట్రీట్ లైట్స్, పార్కులు అభివృద్ధి వంటి ప్రాథమిక సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారిస్తూ వాటి పరిష్కారానికి అధికారుల సమన్వయంతో కృషి చేస్తున్నామని వివరించారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా కృషి చేస్తున్నామన్నారు. తద్వారా పార్టీ బలోపేతానికి పలు కార్యక్రమాలు చేపడుతున్నామని వివరించారు. దీంతో యువత, మహిళలను పార్టీలోకి ఆకర్షిస్తూ బూత్ స్థాయి వరకు పార్టీ నిర్మాణాన్ని మరింత పటిష్టం చేస్తున్నామని వివరించారు. ముఖ్యంగా గడప గడపకు వెళ్లి ప్రజలతో నేరుగా మాట్లాడే కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తున్నామని వివరించారు. ఇటీవల నిర్వహించిన సమావేశాలలో కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, ప్రభుత్వ విధానాలను ప్రజలకు వివరించడంతో పాటు రాబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని కార్యాచరణను రూపొందిస్తున్నామన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేస్తూ ఐక్యంగా పని చేస్తున్నామని వివరించారు. డివిజన్ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నట్లు కేశెట్టి ప్రసాద్ ఈ సందర్భంగా తెలిపారు.

# ఏఎస్ రావునగర్ మెహిల్ రెస్టారెంట్‌లో ఆహార నాణ్యతపై వివాదం

## వినియోగదారులపై దాడి








**ఏఎస్ రావునగర్, ఏప్రిల్ 10, (తెలంగాణ దిశ):** ఏఎస్ రావునగర్‌లోని రాధిక థియేటర్ ఎదురుగా ఉన్న మెఫిల్ రెస్టారెంట్‌లో ఆహార నాణ్యతపై వివాదం చెలరేగింది. బిర్యానీ తినేందుకు వెళ్లిన సత్తిరెడ్డి, నరేష్, గణేష్ అనే వినియోగదారులు తాము తీసుకున్న బిర్యానీ చల్లగా ఉండటంతో పాటు రుచి లేకపోవడంతో పాటు, ఖద్దూ కా కీర్ స్వీట్ నుంచి చెడు వాసన వస్తోందని ఆరోపించారు. ఈ విషయంపై రెస్టారెంట్ సిబ్బందిని ప్రశ్నించగా, ఆహారం బాగానే ఉందని చెప్పి మార్చి ఇస్తామని చెప్పినట్లు వినియోగదారులు తెలిపారు. అయితే కుళ్లిన వాసన వస్తున్న ఆహారం ఎలా ఇస్తారని నిలదీయడంతో పాటు, అధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించగా, రెస్టారెంట్ యాజమాన్యం తమపై దాడి చేసిందని బాధితులు ఆరోపించారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ, వినియోగదారుల ఆరోగ్యాన్ని ప్రమాదంలోకి నెట్టే విధంగా చెడు నాణ్యత గల ఆహారం అందిస్తున్న రెస్టారెంట్ యాజమాన్యంపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే కుళ్లిన చికెన్, చెడిపోయిన బిర్యానీని ఫ్రిజ్‌లో నిల్వ చేసి మరుసటి రోజు వినియోగదారులకు ఇస్తున్నారనే అనుమానం వ్యక్తం చేశారు. ఫిర్యాదు అందుకున్న కుషాయిగూడ పోలీసులు రెస్టారెంట్ నిర్వాహకులను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారణ చేపట్టారు. ఇదిలా ఉండగా రెస్టారెంట్ ముందు ప్రధాన రహదారి ఫుట్‌పాత్‌పై వాహనాలు పార్క్ చేయడం వల్ల తరచుగా ట్రాఫిక్ జామ్ సమస్య తలెత్తుతోందని స్థానిక వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# తెలంగాణలో కరెంట్ షాక్‌తో చనిపోతే రూ.8 లక్షలు..

## ఛార్జీల పెంపు లేదు: టీ-ఈఆర్సీ కీలక నిర్ణయాలు




**హైదరాబాద్,తెలంగాణ దిశ:**తెలంగాణలో విద్యుత్ వినియోగదారులకు రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (ఈఆర్సీ) ఒకేసారి రెండు శుభవార్తలు అందించింది. రాష్ట్రంలో ఎవరైనా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌తో మరణిస్తే ఇచ్చే ఎక్స్‌గ్రేషియాను భారీగా పెంచుతూ కీలక నిర్ణయం తీసుకుంది. దీంతోపాటు ఈ ఏడాదికరెంట్ ఛార్జీల పెంపుఉండబోదని స్పష్టం చేసి ప్రజలకు పెద్ద ఊరటనిచ్చింది. 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన టారిఫ్ ఆర్డర్‌ను తాజాగా ఈఆర్సీ విడుదల చేసింది. విద్యుత్ ప్రమాద మృతులకు భారీగా పెరిగిన పరిహారం.. 2 నెలల్లోనే చెల్లింపు: ఇప్పటివరకు విద్యుత్ షాక్‌తో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా అందిస్తుండగా, దానిని మరో రూ.3 లక్షలు పెంచి రూ.8 లక్షలు చేసింది. ఈ పెంచిన పరిహారం ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచే అమల్లోకి వస్తుందని స్పష్టం చేసింది. బాధితుడి కుటుంబానికి రెండు నెలల్లోపే ఈ సొమ్మును అందించాలని, జాప్యం జరిగితే అందుకు గల కారణా లను లిఖితపూర్వకంగా వివరించాలని డిస్కంలను ఆదేశించింది. వినియోగదారుడి తప్పిదం వల్ల ప్రమాదం సంభవించినా ఈ పరిహారం వర్తిస్తుందని స్పష్టం చేయడం గమనార్హం. పాత ఛార్జీలే కొనసాగింపు: మరోవైపు ఈ ఏడాది కూడా పాత కరెంట్ ఛార్జీలనే కొనసాగించాలని ఈఆర్సీ నిర్ణయించింది. ఛార్జీల పెంపు ప్రతిపాదన ఏదీ లేదని స్పష్టం చేసింది. దీంతో పాటు ఇళ్ల పైకప్పులపై ఏర్పాటు చేసుకున్న సోలార్ ప్లాంట్ల వినియోగదారులకు ఊరట కల్పించింది. అదనపు యూనిట్ల వాడకంపై అధిక శ్లాబుల ప్రకారం వసూలు చేసిన అదనపు మొత్తాన్ని రాబోయే మూడు నెలల బిల్లుల్లో సర్దుబాటు చేయాలని డిస్కంలను ఆదేశించింది.

# కాపు నేతలకు గాలం

**కాకినాడ,తెలంగాణ దిశ :** ఏపీలో రాజకీయాలు విచిత్రంగా మారుతున్నాయి. వచ్చే ఎన్నికల్లో గెలుపు కోసం ఇప్పటినుంచి పార్టీలు వ్యూహరచన చేస్తున్నాయి. ముఖ్యంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎలాగైనా గెలవాలని భావిస్తోంది. ప్రభుత్వంపై వ్యతిరేకత పెంచి క్యాష్ చేసుకోవాలని చూస్తోంది. సామాజిక వర్గాలను తెరపైకి తెచ్చి మరోసారి విజయం అందుకోవాలని భావిస్తోంది. కానీ అది అంత సులువుగా దక్కేలా లేదు. ఎందుకంటే 2014 నుంచి 2024 వరకు వైసిపి చేపట్టిన ఈ ఫార్ములా ఆ పార్టీకి వర్కౌట్ అయింది. కానీ ఇప్పుడు ఎంత మాత్రం అది సాధ్యమయ్యే అవకాశం లేదు. కుల సమీకరణల ద్వారా రాజకీయం చేస్తామంటే కుదిరే పని కూడా కాదు. ముఖ్యంగా పవన్ కళ్యాణ్ ను దృష్టిలో పెట్టుకొని కాపు సామాజిక వర్గంపై జగన్మోహన్ రెడ్డి ఫోకస్ పెట్టినట్లు తెలుస్తోంది. గతం మాదిరిగా ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ అనే నినాదం పక్కకు వెళ్లిపోయినట్లు సమాచారం.వాస్తవానికి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సంప్రదాయ ఓటు బ్యాంక్ అనేది రెడ్డి సామాజిక వర్గంతో పాటు ఎస్సీ సామాజిక వర్గాలే ఉండేవి. 2014 ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నిలబడడానికి కారణం ఆ రెండు సామాజిక వర్గాలు మాత్రమే. రాయలసీమలో రెడ్డి సామాజిక వర్గ ప్రాబల్యం ఉన్న ప్రాంతం కావడంతో అక్కడ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నిలబడగలిగింది. ఎస్సీలతో పాటు ఎస్టీ రిజర్వుడు నియోజకవర్గాల్లో గెలవగలిగింది వైయస్సార్ కాంగ్రెస్. అయితే 2019 ఎన్నికల్లో ఆ రెండు సామాజిక వర్గాలు స్టాండ్ అయ్యాయి. ఆపై మిగతా సామాజిక వర్గాలు సహకరించాయి. దీంతో అంతులేని, అద్భుత విజయం సొంతం చేసుకుంది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. కానీ 2024 ఎన్నికలు వచ్చేసరికి బీసీ నామస్మరణ చేశారు జగన్మోహన్ రెడ్డి. ఎలాగూ సంప్రదాయ ఓటు బ్యాంకు ఉంటుందని భావించి అలా చేశారు. కానీ రాజకీయంతో పాటు ఆర్థికంగా ఏమాత్రం సహకారం అందకపోవడంతో రెడ్డి సామాజిక వర్గం మౌనం దాల్చింది. ఎస్సీ సామాజిక వర్గ ఓట్లు చీలిపోయి దారుణ పరాజయం ఎదురైంది.ఇప్పుడు కూడా కుల సమీకరణల ద్వారా రాజకీయాలు చేయాలని చూస్తున్నారు జగన్మోహన్ రెడ్డి. పవన్ కళ్యాణ్ వెంట కాపు సామాజిక వర్గం ఉందన్న ఆలోచనతో ముద్రగడ పద్మనాభం, చేగొండి హరి రామ జోగయ్య, వంగవీటి మోహన్ రంగా వంటి కుటుంబాలను ఆకర్షించాలని చూస్తున్నారు. ఇప్పటికే ముద్రగడ ఫ్యామిలీ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఉంది. చేగొండి హరి రామ జోగయ్య వైసీపీకి అనుకూలంగా పావులు కదుపుతున్నారు. వంగవీటి మోహన్ రంగా కుమార్తె ఆశ కిరణ్ ను వైసీపీలోకి రప్పించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే పేరు మోసిన కుటుంబాలు వైసీపీలోకి వస్తే చాలదు. క్షేత్రస్థాయిలో కాపు సామాజిక వర్గంలో ఆశలు చిగురించే ప్రయత్నాలు జరగాలి. వారి సమస్యల పట్ల జగన్మోహన్ రెడ్డి స్పందించాలి. అంతేతప్ప ప్రముఖుల కుటుంబాలను కాపుల్లో చేర్చితే ఎంత మాత్రం వర్కౌట్ కాదు. 2014లో టిడిపి గెలిచిన తర్వాత ముద్రగడ పద్మనాభం కాపు రిజర్వేషన్ ఉద్యమం లేవనెత్తారు. ఆ సమయంలో కాపులు టిడిపి పట్ల ఆగ్రహంతో ఉండేవారు. అలా వారు వైసిపి వైపు వెళ్లారు. కానీ ఆ పోరాటం చేసిన ముద్రగడ పద్మనాభం 2024 ఎన్నికలకు ముందు వైసీపీలో చేరారు. కానీ ఆ పార్టీని నమ్మలేదు కాపులు. ఇప్పుడు కూడా కాపు ప్రముఖులను నమ్ముకుంటే కంటే.. కాపుల కోసం చేసే ప్రయత్నాలతో పాటు ప్రకటనలు, పోరాటాల వారికి ఆకట్టుకునేలా చేస్తాయి. ఇక తేల్చుకోవాల్సింది జగన్మోహన్ రెడ్డి మాత్రమే.

## కాప్రాలో బ్యానర్లు ఫోటోలకే పరిమితమైన

# 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక'

## అమలు మాత్రం నామమాత్రం.. ప్రచారం ఘణం...,



**కాప్రా, ఏప్రిల్ 10 ,తెలంగాణ దిశ :** తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక' 99 రోజుల ప్రత్యేక కార్యక్రమం కాప్రా సర్కిల్ పరిధిలో ఆశించిన స్థాయిలో అమలు కావడం లేదన్న విమర్శలు తీవ్రంగా వినిపిస్తున్నాయి. కార్యక్రమం ప్రారంభమై 35 రోజులు గడిచినా, గ్రౌండ్ స్థాయిలో మార్పులు కనిపించకపోవడంతో ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం మార్చి 6 నుండి జూన్ 12 వరకు ఈ కార్యక్రమాన్ని అమలు చేయాలని నిర్ణయించి, పట్టణ ప్రాంతాల్లో సమస్యల పరిష్కారం, మౌలిక వసతుల అభివృద్ధి, ప్రజలకు సేవల సరఫరా మెరుగుదల వంటి ముఖ్య లక్ష్యాలతో కార్యక్రమాన్ని చేపట్టింది. ఇందులో భాగంగా అధికారులు ప్రజల వద్దకు వెళ్లి వారి సమస్యలను తెలుసుకుని, తక్షణ పరిష్కారం చూపాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. అదేవిధంగా ఆరు గ్యారంటీ పథకాల అమలును వేగవంతం చేయడం, పారదర్శకతను పెంచడం, ప్రజలతో నేరుగా సంబంధాలను బలోపేతం చేయడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశాలుగా పేర్కొంది. కానీ కాప్రా సర్కిల్ పరిధిలో ఈ కార్యక్రమం అమలు మాత్రం కాగితాలకే పరిమితమైందని స్థానికులు ఆరోపిస్తున్నారు. కాలనీల్లో అధికారులు పర్యటించినట్లు ఫోటోలు తీసుకుని, బ్యానర్లు ఏర్పాటు చేసి ప్రచారం చేస్తున్నారే తప్ప, సమస్యల పరిష్కారంలో మాత్రం పెద్దగా పురోగతి లేదని ప్రజలు చెబుతున్నారు. డ్రైనేజీ సమస్యలు, చెత్త సేకరణలో లోపాలు, రోడ్ల దుస్థితి, వీధి దీపాల పనితీరు వంటి ప్రాథమిక సమస్యలు యథాతథంగానే కొనసాగుతున్నాయని వారు అంటున్నారు. కొన్ని ప్రాంతాల్లో అధికారులు ముందస్తు సమాచారం ఇచ్చి, తాత్కాలికంగా శుభ్రపరిచే చర్యలు తీసుకుని ఉన్నతాధికారుల పర్యటనల సమయంలో మాత్రమే చురుకుదనం ప్రదర్శిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారులు ప్రజలతో ప్రత్యక్షంగా మాట్లాడకుండా, కేవలం రికార్డుల కోసం కార్యక్రమాలు నిర్వహిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇంకా ప్రజల నుండి వచ్చే ఫిర్యాదులను నమోదు చేయడం, వాటిపై ఫాలోఅప్ చర్యలు తీసుకోవడం వంటి అంశాలు సరిగా అమలు కావడం లేదని స్థానికులు పేర్కొంటున్నారు. కొందరు ప్రజలు పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ స్పందన లేకపోవడం వల్ల నిరాశకు గురవుతున్నారని తెలిపారు. ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక ద్వారా ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్న ప్రజలకు చేరువ కావడం, సేవలను నేరుగా అందించడం, సమస్యలను వేగంగా పరిష్కరించడం వంటి ముఖ్య ఉద్దేశాలు కాప్రా సర్కిల్‌లో నెరవేరడం లేదని స్పష్టమవుతుంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించి, కార్యక్రమం అమలుపై కఠిన చర్యలు తీసుకోవాలని, బాధ్యత వహించని అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఈ కార్యక్రమం నిజమైన ప్రజా పాలనగా మారాలంటే కేవలం ప్రచారం కాకుండా, గ్రౌండ్ స్థాయిలో స్పష్టమైన మార్పులు కనిపించేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.



# ఏపీకి ఆర్థిక కష్టాలు



**విజయవాడ,తెలంగాణ దిశ :**ఆంధ్రప్రదేశ్ ఆర్థిక పరిస్థితి రోజురోజుకీ కఠినంగా మారుతోందన్న అభిప్రాయం బలపడుతోంది. 2014 జూన్ 2న రాష్ట్ర విభజన జరిగినప్పటినుంచి ఇప్పటివరకు పూర్తిస్థాయిలో ఆర్థిక ఇబ్బందుల నుంచి బయటపడలేకపోయిందన్నది వాస్తవం. రాజకీయంగా తీవ్రమైన పోటీ ఉండటంతో అధికారంలోకి రావడమే లక్ష్యంగా పార్టీలు అనేక ఉచిత హామీలు ఇస్తూ వచ్చాయి. అదే సమయంలో ఆదాయ వనరులు బలపడకపోవడం రాష్ట్ర ఖజానాపై తీవ్ర ఒత్తిడిని తీసుకొచ్చింది.విభజన సమయంలోనే ఏపీ భారీ రెవెన్యూ లోటుతో ప్రారంభమైంది. కాగ్ నివేదిక ప్రకారం 2014?15 ఆర్థిక సంవత్సరంలోనే దాదాపు 24,194 కోట్ల రూపాయల లోటు నమోదైంది. ఆ తర్వాత ఆదాయాన్ని తెచ్చే హైదరాబాద్ వంటి మహానగరం లేకపోవడంతో లోటు క్రమంగా పెరుగుతూ వచ్చింది. సంవత్సరానికోసారి ఆదాయానికి, ఖర్చులకు మధ్య అంతరం పెరిగి చివరకు సాధారణ పరిపాలనా అవసరాలకే రుణాలు తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందిఈ పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వం రెండో దశ జీఎస్టీ సంస్కరణల పేరుతో ఈ ఏడాది అక్టోబర్ నుంచి కొత్త స్లాబులు అమల్లోకి తీసుకొచ్చింది. మధ్యతరగతి, దిగువ తరగతికి ఊరట కలిగించాలన్న ఉద్దేశంతో అనేక వస్తువులను జీఎస్టీ పరిధి నుంచి మినహాయించారు. దీని వల్ల రాష్ట్రాలకు వచ్చే ఆదాయం తగ్గిపోయింది. ఏపీకి సుమారు ఎనిమిది వేల కోట్ల రూపాయల వరకు నష్టం వాటిల్లుతుందన్న అంచనాలు అప్పుడే వినిపించాయి. కానీ వాస్తవంగా చూస్తే ఈ ప్రభావం మరింత తీవ్రంగా కనిపిస్తోందని అధికారులు చెబుతున్నారు.గణాంకాలు పరిశీలిస్తే గత ఏడాది అక్టోబర్‌లో జీఎస్టీ ద్వారా రాష్ట్రానికి 2,777 కోట్ల రూపాయలు ఆదాయం రాగా, ఈ ఏడాది అదే నెలలో అది స్పష్టంగా తగ్గింది. అలాగే గత ఏడాది నవంబర్ లో 2,827 కోట్ల రూపాయలు వచ్చిన చోట ఈ ఏడాది నవంబర్‌లో కేవలం 2,697 కోట్ల రూపాయలకే పరిమితమైంది.

# పులులతోనే అడవులకు మనుగడ..!



పర్యావరణానికి పులలకు అవినాభావ సంబంధం ఉంది. అడవులను రక్షించుకోవాలంటే జంతువుల మనుగడ సాగాలి. జంతువులను కాపాడుకుంటేనే అడవులు పచ్చగా ఉంటాయి. ప్రకృతిని విధ్వంసం చేస్తున్న ప్రజలు అడవులను, కొండలను ధ్వంసం చేయడంతో అక్కడక్కడా ఉన్న పులులు నగరాల మీదకు వస్తున్నాయి. వాటిని చూసి వామ్మో పులి అంటూ పరుగెడుతున్నాయి. అడవులు చక్కగా ఉన్నంత కాలం అవి అక్కడే మనగుడ సాగించాయి. ఒక్క పులులే కాదు. సమస్య జంతుజాలంనకు అడవులే ఆవాసం. వాటిని సంరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిది. అవి ఉంటేనే అడవులు, ప్రకృతి పచ్చగా ఉంటాయి. అలాంటి అడవులను యధేచ్ఛగా నరికేస్తున్నాం. కొండలను ధ్వంసం చేస్తున్నాం. దీంతో పులులు, చిరుతలు అడపాదడపా అడవుల శివారు గ్రామాల్లోకి వస్తున్నాయి. ఆహారం, నీరు కోసం తంటాలు పడుతున్నాయి. ఇప్పటికే కోతులు మనుషలను మించి గ్రామాల్లో సంచరిస్తున్నాయి. వీటిని తరిమికొట్టే చర్యలు తీసుకోవడం లేదు. దీంతో ఇవి ప్రజల ఆస్తులను, పంటలను ధ్వంసం చేస్తున్నాయి. మనుషులపై పడి కరుస్తున్నాయి. ఇకపోతే తెలుగు రాష్ట్రాల్లో ఈ మధ్య పులుల, చిరుతల సంచారం అడపదడపా కనిపిస్తోంది. నల్లమల, తిరుమల కొండలతో పాటు తెలంగాణ జిల్లాల్లోని అటవీ ప్రాంతంలో వీటి సంచారాం పెరిగింది. అటవీ అధికారుల లెక్కల ప్రకారం ఉభయ రాష్ట్రాల్లో పులుల సంచారం ఎక్కువైంది. ఓ వైపు మహారాష్ట్రలోని తాడోబా నుంచి, మరో వైపు నల్లమల నుంచి టైగర్లు కొత్త ఆవాసాలను వెతుక్కుంటూ సరిహద్దుల్లోని పలు జిల్లాల్లో తిరుగుతున్నాయి. తాడోబాలో పులుల సంతతి పెరిగిపోవడం.. అంతర్గత సంఘర్షణల వల్లే పులులు గోదావరి దాటి ఆసిఫాబాద్ జిల్లాలోకి అడుగుపెడుతున్నాయని, అక్కడి నుంచి ఉమ్మడి ఆదిలాబాద్ మీదుగా జిల్లాల్లోకి ప్రవేశిస్తున్నాయని అటవీశాఖ అధికారులు చెబుతున్నారు. మహారాష్ట్ర లేదా ఛత్తీస్‌గఢ్ నుంచి ఓ పులి గోదావరి దాటి వచ్చినట్టు అనుమానిస్తున్నారు. పులుల సంచారం పెరగడంతో వీటు అప్రమత్తం అయ్యారు. స్థానికులు, వేటగాళ్ల నుంచి ముప్పు పొంచి ఉండడంతో ప్రత్యేక బృందాల ద్వారా గస్తీ కాస్తున్నారు. సోమశిల పరిధిలో ఓ పులి సంచారంతో యంగంపల్లితండా దాని చుట్టుపక్కల గ్రామాల ప్రజలు కంటి మీద కునుకు లేకుండా గడుపుతున్నారు. నాగార్జునసాగర్, శ్రీశైలం టైగర్ రిజర్వ్ వైపు నుంచి కృష్ణా నదిని ఈదుకుంటూ వచ్చిన ఓ పెద్దపులి తమ ప్రాంతంలో సంచరిస్తోందని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. గ్రామస్తుల సమాచారంతో అప్రమత్తమైన అటవీశాఖ అధికారులు ఆ ప్రాంతాన్ని జల్లెడ పట్టగా.. వ్యవసాయ పొలాల్లో పులి పాదముద్రలు కనిపించాయి. ఇకపోతే ఇటీవల గుర్తు తెలియని వాహనం ఢీకొని ప్రకాశం జిల్లాలో ఓ పులి మృత్యువాత పడింది. సాధారణంగా వేసవి కాలంలో పులులు రిజర్వ్ ఫారెస్ట్ వైపు నుంచి అమ్రాబాద్ వైపు సంగమేశ్వర ప్రాంతం గుండా నదిని దాటుతుంటాయి. రెండు రాష్ట్రాల సరిహద్దులు దగ్గరగా ఉండటం, అక్కడ నీటి లోతు తక్కువగా ఉండడంతో పులులు కొల్లాపూర్ ఫారెస్ట్ లిమిట్స్‌లోని మార్గాన్ని ఎంచుకుంటాయని అధికారులు చెబుతున్నారు. గతంలో మహారాష్ట్ర నుంచి వచ్చే ఒకటో రెండో పులులను కాపాడేందుకే అష్టకష్టాలు పడ్డ ఫారెస్ట్ ఆఫీసర్లకు ఇప్పుడు పెద్దసంఖ్యలో వస్తున్న పులులను రక్షించడం పెను సవాల్‌గా మారింది. టైగర్ కారిడార్‌లోని అడవుల్లో ఇటీవలి కాలంలో సీసీ కెమెరాలు ఏర్పాటుచేసి పులులను ట్రాక్ చేస్తున్నారు. వాటి కదలికలను నిత్యం గమనించేందుకు టైగర్ ట్రాకర్లను సైతం నియమించారు. అధికారులు ఎన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నా వేటగాళ్ల రూపంలో పెద్దపులులు ప్రాణాలు కోల్పోతున్నాయి. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో 36 నుంచి 45 వరకు పులులు ఉన్నాయని చెబుతున్నారు. పులులు సంచరిస్తున్న అటవీ ప్రాంతాల్లో ఎలాంటి ఉచ్చులు బిగించకూడదని, పులి కదలికలు కనిపిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. మహారాష్ట్ర లోని తాడోబా టైగర్ రిజర్వ్ నుంచి పులులు తెలంగాణ వైపు క్యూ కడుతున్నాయి. అక్కడి టైగర్ రిజర్వ్‌లో పులుల సంఖ్య గణనీయంగా పెరిగిపోవడంతో కొత్త ఆవాసాలను వెతుక్కుంటూ ప్రాణహిత నది దాటి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోకి ప్రవేశిస్తున్నాయి. ఈ సీజన్‌లో తాడోబా నుంచి సుమారు 3-4 పులులు రాష్ట్రంలోకి ప్రవేశించాయని, దీంతో కాగజ్‌నగర్, ఆసిఫాబాద్ అటవీ ప్రాంతాలు ఇప్పుడు 'టైగర్ జోన్'గా మారిపోయిందని చెప్తున్నారు. కాగా ఈ పులుల్లో కొన్ని వెనక్కి వెళ్లిపోతుండగా, మరికొన్ని తిర్యాణి, పెంచికల్‌పేట రేంజ్‌లలో ఆవాసం కోసం ప్రయత్నిస్తున్నట్లు పేర్కొంటున్నారు.

కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలోకి వస్తున్న పులులు రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లోకి ప్రవేశిస్తున్నాయి. ఇటీవల ఆసిఫాబాద్ నుంచి మొదలైన ఓ టైగర్ జర్నీ మంచిర్యాల, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కామారెడ్డి జిల్లాల మీదుగా సాగి సిద్దిపేట జిల్లాలోకి చేరింది. తొగుట, మిరుదొడ్డి, కొండాపూర్ మండలాల్లో పులి పాదముద్రలు కనిపించాయని, సిద్దిపేట పట్టణానికి దగ్గరగా కూడా వచ్చిందని స్థానికులు చెబుతున్నారు. సిద్దిపేట జిల్లాలో పులి కనిపించడం ఇదే తొలిసారి. కొత్త ఆవాసం కోసమో.. తోడు కోసమో ఈ పులి దాదాపు 300 కిలోమీటర్లకుపైగా నడిచి ఉంటుందని ఆఫీసర్లు భావిస్తున్నారు. ఈ పులి రాష్ట్రంలోని 14 జిల్లాలో సంచరిస్తున్నట్లు గుర్తించారు. తాజాగా భూపాలపల్లి జిల్లాలోనూ పులి సంచారం కలవరపెడుతోంది. ఇటీవల భూపాలపల్లి అడవి నుంచి జకారం వద్దరోడ్డు దాటుతుండగా ఓ అంబులెన్స్ డ్రైవర్ చూసినట్టు స్థానికులు చెబుతున్నారు. ములుగు,అబ్బాపూర్, జాకారం, పందికుంట బీట్లలో పులి పాదముద్రలను గుర్తించారు.

## కమాన్పూర్ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ అభియాన్ కార్యక్రమం

**కమాన్పూర్,తెలంగాణ దిశ :** కమాన్పూర్ మండల కేంద్రంలోని అంగన్‌వాడీ పాఠశాలలో పోషణ్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమాన్పూర్ సర్పంచ్ రంగు సత్యనారాయణ గౌడ్, ఉపసర్పంచ్ రఫీక్ సోహెల్ పాల్గొని గర్భిణీ స్త్రీలకు పోషకాహార ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు.
ఈ సందర్భంగా గర్భిణీ మహిళలకు కోడిగుడ్లు, పాలు పంపిణీ చేసి, ఆరోగ్యకరమైన ఆహారంతో తల్లి-బిడ్డల ఆరోగ్యం మెరుగుపడుతుందని వివరించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం, బాలభారతి సిబ్బంది, అంగన్‌వాడీ ఉపాధ్యాయులు కృష్ణ కుమారి, భాగ్య, కుమారి, సరోజన తదితరులు పాల్గొన్నారు. గ్రామస్థాయిలో పోషణపై ప్రత్యేక దృష్టి పెట్టడం ద్వారా మాతృ-శిశు ఆరోగ్యం బలోపేతం అవుతుందని నిర్వాహకులు తెలిపారు. పోషకాహారం, పరిశుభ్రత, క్రమమైన వైద్య పరీక్షలు తప్పనిసరిగా పాటించాలని గర్భిణీ మహిళలకు సూచించారు.

# పండూ..నీ పేరెవరు పెట్టారూ!



'పండ్ల మహారాజు మామిడి గారొస్తున్నారహో' అంటూ దండోరా వేసే సమయం ఆసన్నమైంది. ఆ రాక కోసం దేశంలోని ప్రజలంతా వేయి కళ్లతో వేచి చూస్తుంటారు. మండుటెండల్లో పండు వెన్నెల్లా ఆనందాన్ని కలిగించే అనుభూతి కోసం ఎవరు మాత్రం ఎదురు చూడరు మరి! ఫలరాజు అంటే ఒక్కరేనా, యువరాజులు, సామంత రాజులు, జమీందార్లు ఇలా ఓ పరివారమే మనల్ని పలకరిస్తుంది. అల్ఫాన్సో, దశ్‌హరి, చౌంసా, బంగినపల్లి ఇలా ఒక్కో రకానికీ ఒక్కో పేరు, ప్రత్యేకత! అసలు వాటికి ఆ పేర్లు ఎలా వచ్చాయి, ఎవరు పెట్టారు అన్న సంగతులు ఆద్యంతం ఆసక్తికరం!

మామిడి పండు ప్రపంచ ప్రసిద్ధి చెందిందే అయినా భారతదేశంలో మాత్రం దాని అభిమానులు చాలా ఎక్కువ. ఒక్క మన దగ్గరే దాదాపు 1500 రకాల మామిడి పండ్లు పండుతున్నాయి. మనం ఏటా 25 మిలియన్ మెట్రిక్ టన్నుల పండ్లను ఉత్పత్తి చేస్తున్నాం. ఇది ప్రపంచంలోనే అత్యధికం. భూమ్మీద పండుతున్న మామిడి పండ్లలో 45 శాతం వాటా భారత్‌దే. ఇంత ప్రాధాన్యం ఉన్న ఈ పండులో కొన్ని రకాలు మరింత ప్రాచుర్యం పొందాయి. వాటికి పేర్లు అవి పండే ప్రాంతాన్ని, పెంచిన వ్యక్తులను, వాటి రంగు రుచులను బట్టి వచ్చాయి. అందుకే ఒక్కో పేరు ఒక్కో పండంత ప్రత్యేకం!

**అల్ఫాన్సో.. ఓ పోర్చుగీస్ జనరల్!:** భారతదేశంలో వ్యాపారం కోసం వచ్చిన విదేశీయుల్లో పోర్చుగీసు వాళ్లు ప్రథములు. గోవా రాష్ట్రంలో వీరు ఎక్కువగా కాలనీలు నిర్మించుకుని నివసించారు. ఆ సమయంలోనే భారత్‌లో మామిడి పండ్లు వాళ్లను అమితంగా ఆకట్టుకున్నాయి. దీంతో వారు అంటుకట్టే విధానంలో రకరకాల మామిడి పండ్లను పండించడాన్ని ప్రారంభించారు. ఐరోపాలో పండేందుకు వీలుగా వీటిలో మార్పులు చేర్పులు చేశారు. అలా సృష్టించిన వాటిలో ఒక రకమే అల్ఫాన్సో. మంచి సువాసన, రంగు, ముక్కలు తరగడానికి వీలుగా ఉండే గుజ్జు దీని ప్రత్యేకతలు. ఇక, భారత్‌తోపాటు ఇతర ఆసియా దేశాల్లో పోర్చుగీసు కాలనీలు ఏర్పడటంలో కీలక పాత్ర పోషించిన గవర్నర్ అల్ఫాన్సో అల్బుకర్క్ పేరు మీదుగా దీనికి అల్ఫాన్సో మామిడిగా నామకరణం చేశారు. భారత్‌తోపాటు వివిధ దేశాల్లో చాలామంది ఇష్టపడే అల్ఫాన్సో ఖరీదైన మామిడి రకాల వరుసలో ఉంటుంది.

**తోతాపురి..చిలుక ముక్కు!:** మామిడి పండ్లలో మనకు సుపరిచితమైన రకాల్లో తోతాపురి తప్పకుండా ఉంటుంది. ఎక్కడ మామిడి పండ్లు ఉన్నా అక్కడ తోతాపురి రకం కనిపించకుండా ఉండదు అనేంతగా మన దగ్గర ఆ రకం పండ్లు దొరుకుతాయి. అయితే ఎరుపు ఆకుపచ్చల కలయికగా ఉండే ఈ పండుకు ఆ పేరు దాని ఆకృతి వల్లే వచ్చింది. హిందీలో తోతా అంటే చిలుక. ఈ పండు అచ్చం చిలుక ముక్కులా చివర్లో వంకర తిరిగి ఉంటుంది కనుక ఈ పండుకు చిలుక ముక్కు లేదా చిలుక ముఖం పండు అని పిలుస్తారు. కన్నడనాట గినిమూతి (చిలుకమూతి) మామిడి కాయగా పిలుస్తారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో ఇది ఎక్కువగా పండుతుంది. ఇక, కర్ణాటకలో విరివిగా పండే బాదామి రకం పండ్లకు కూడా దాని బాదం గింజ ఆకృతిని బట్టే ఆ పేరు వచ్చిందట.

**సింధ్‌లో పండే సింధ్రీ!:** సింధ్రీ రకం మామిడి పండుకు అది పండే ప్రాంతాన్ని బట్టి పేరు వచ్చింది. స్వతంత్రం రావడానికి ముందు మనదేశంలో భాగంగా ఉన్న సింధ్ ప్రాంతంలో ఈ పండు పండేదట. ప్రస్తుతం సింధ్ పొరుగు దేశం పాకిస్థాన్‌లో ఉంది. ఒక రకమైన సువాసనతో, తీపిలోనే చిరు వగరు కలగలిపిన రుచితో ఉంటుందీ పండు. ఖరీదైన మామిడి పండ్లలో ఒక రకం ఇది. ఇక, దాదాపు ఇదే తరహా పేరుతో మన దగ్గర సింధూరి పండు పండుతుంది.



సింధూర వర్ణంలో ఉండే దీని గుజ్జును, చెక్కును బట్టి దీనికి సింధూరి అనే పేరును పెట్టారట. తెలుగు రాష్ట్రాలతోపాటు కర్ణాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లో బాగా పండుతుంది.

**చౌంసా.. ఓ విజయం!:** మొఘల్ రాజు హుమాయూన్‌కీ, షేర్‌షా సూరికీ మధ్య బిహార్‌లోని చౌంసా అనే ప్రాంతంలో 1539లో యుద్ధం జరిగింది. ఇందులో షేర్ షా హుమాయూన్‌ని ఓడించాడు. ఆ విజయానికి గుర్తుగా ఆ ప్రాంతంలో పండే తనకిష్టమైన అమిత తీపి రకం మామిడి పండుకి చౌంసా అని పేరు పెట్టాడట షేర్ షా. ఆ విధంగా ఓ విజయానికి గుర్తుగా ఈ పండుకి పేరు ఏర్పడిందన్నమాట. బిహార్, ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రాల్లో అధికంగా పండే ఇవి దేశమంతా అందుబాటులో ఉంటాయి.

**దశ్‌హరి.. ఓ ఊరి పేరు!:** మనకు బాగా తెలిసిన దశ్‌హరి మామిడి పండు ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రానికి సంబంధించింది. లక్నో నగరం దగ్గరి దశ్‌హరి గ్రామంలో తొలుత ఈ పండు పండింది. ప్రత్యేక రుచి కలిగిన ఈ మామిడి పండును అంటుకట్టడం ద్వారా సృష్టించాడు ఆ ప్రాంతపు జమీందారు అబ్దుల్ హమీద్ ఖాన్ కాందహారీ. ఆయన



మంచి వ్యవసాయవేత్త. ఎన్నో రకాలైన చెట్లు హమీద్ వ్యవసాయ క్షేత్రంలో ఉండేవి. అందుకే లక్నో నవాబు ఉండే ప్యాలెస్‌లోని తోటల్లోనూ పెంచేవారట. రాజులు అమితంగా వీటిని ప్రేమించడంతో బాగా పేరొచ్చింది. అక్కడినుంచి ఇవి దేశం మొత్తం మీదా మామిడి రకాల్లో ప్రత్యేక స్థానాన్ని సంపాదించాయి. తొలిచెట్టు దశ్‌హరి నుంచే వచ్చింది కాబట్టి ఆ పండుకు దశ్‌హరి అనే పేరే స్థిరపడిపోయింది. తెలుగు రాష్ట్రాల్లో బాగా ఫేమస్ అయిన బంగినపల్లి మామిడి పండు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నంద్యాల జిల్లాలోని బనగానపల్లి అనే గ్రామానికి చెందిన రకం. ఆ ఊరి పేరు మీదుగానే దానికా పేరు వచ్చిందన్నమాట!

**లంగ్డా.. ఓ వ్యక్తి!:** మామిడి పండ్లలో పాలలాంటి వాసనతో ఉండే లంగ్డా రకం కూడా చాలామందికి ఇష్టం. హిందీలో కుంటివాడు అని అర్థంవచ్చే ఈ చిత్రమైన పేరు వెనుక ఒక కథ ఉంది. 250-300 సంవత్సరాల క్రితం ఉత్తర్‌ప్రదేశ్‌లోని వారణాసిలో ఒక రైతుతోటలో మొట్టమొదట ఈ చెట్టు ఉండేదట. ఎంతో జాగ్రత్తగా తన మామిడి తోటను చూసుకునే వాడట ఆ రైతు. అందులో కాసిన వాటిలో, ఈ రకం ప్రత్యేకంగా ఎంతోమందిని ఆకట్టుకున్నాయి. ఇక, ఆయన ఏదో సమస్య వల్ల కుంటుతూ నడిచేవాడట. దీంతో ఆ రైతు తోటలోవి అని చెప్పడానికి లంగ్డా ఆమ్ అని చెప్పేవారట. ఆ తర్వాత ఈ చెట్టు బిహార్‌తోపాటు తెలంగాణ తదితర దక్షిణాది రాష్ట్రాలకు పరిచయమైంది.

## కాఫీని రోజూ అతిగా సేవిస్తున్నారా..?

మోతాదుకు మించితే ఏం జరుగుతుంది..? ఎన్ని కప్పుల కాఫీ తాగాలి..?




రోజూ ఉదయం నిద్ర లేచిన వెంటనే చాలా మంది కాఫీని సేవిస్తుంటారు. ఉదయం బ్రేక్ ఫాస్ట్ చేసిన తరువాత నుంచి మొదలుకొని రోజంతా నాలుగైదు కప్పుల కాఫీ తాగనిదే చాలా మందికి తృప్తిగా అనిపించదు. అయితే కాఫీని తాగడం వల్ల ఆరోగ్య ప్రయోజనాలు ఉన్న మాట వాస్తవమే అయినప్పటికీ కాఫీని మరీ మోతాదుకు మించి తాగకూడదు. కాఫీని అతిగా సేవించడం వల్ల మన ఆరోగ్యానికి హాని కలుగుతుంది. కాఫీ సేవిస్తే టైప్ 2 డయాబెటిస్, పార్కిన్సన్స్ వంటి వ్యాధులు వచ్చే ప్రమాదం తగ్గుతుంది. కానీ మోతాదుకు మించి కాఫీని తాగడం వల్ల అనేక దుష్పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుంది. కాఫీ మన నాడీ మండల వ్యవస్థపై నేరుగా ప్రభావం చూపిస్తుంది. దీంతో ఆందోళన, కంగారు, ఒత్తిడి వంటి సమస్యలు వస్తాయి.

గుండె ఆరోగ్యం దెబ్బ తినే అవకాశం..: కాఫీని మోతాదుకు మించి సేవిస్తే అది నిద్రపై ప్రభావాన్ని చూపిస్తుంది. రాత్రి పూట త్వరగా నిద్ర పట్టదు. నిద్రలేమి సమస్య వచ్చే అవకాశం ఉంటుంది. మన శరీరంలో కెఫీన్ మోతాదు అధికమైతే గుండె కొట్టుకునే వేగం పెరుగుతుంది. ఇది గుండె ఆరోగ్యంపై ప్రభావం చూపిస్తుంది. కాఫీ మోతాదుకు మించితే జీర్ణాశయంలో యాసిడ్ల ఉత్పత్తి పెరుగుతుంది. దీంతో గుండెల్లో మంట,పొట్టలో అసౌకర్యంవంటిసమస్యలు ఏర్పడు తాయి. అలాగే కాఫీ సహజసిద్ధమైన లాక్సేటివ్‌గా పనిచేస్తుంది. ఇది సున్నితమైన జీర్ణాశయం ఉన్నవారిలో విరేచనాలను కలగజేస్తుంది. కాఫీలో ఉండే కెఫీన్ మన శరీరంలో అధికంగా చేరితే బీపీ పెరుగుతుంది. ఇది దీర్ఘకాలంలో హైబీపీ సమస్యకుదారి తీస్తుంది.దీంతో గుండె ఆరోగ్యం దెబ్బతిని హార్ట్ ఎటాక్ కూడావచ్చే ప్రమాదంఉంటుంది.

డీహైడ్రేషన్‌కు అవకాశం..: కాఫీ డైయురెటిక్‌గా పనిచేస్తుంది. ఇది మూత్రం ఉత్పత్తిని పెంచుతుంది. దీంతో శరీరంని నీరు త్వరగా బయటకు పోతుంది. ఫలితంగా డీహైడ్రేషన్ బారిన పడతారు. కనుక కాఫీని అధికంగా తాగకూడదు. కాఫీ తాగడం వల్ల మూడ్ మారుతుంది. ఉత్తేజంగా మారుతారు. యాక్టివ్‌గా పనిచేస్తారు. అయితే కేవలం ఒక కప్పు కాఫీ తాగితేనే ఈ ప్రయోజనాలు కలుగుతాయి. మోతాదుకు మించి కాఫీ సేవిస్తే దీనికి రివర్స్ రియాక్షన్ లా పనిచేస్తుంది. అంటే శక్తి మొత్తం కోల్పోయినట్లు అవుతారు. నీరసం, అలసట వస్తాయి. ఏ పనిచేయలేకపోతారు. కనుక కాఫీని అధికంగా తాగుతున్న వారు ఈ విషయాన్ని కూడా దృష్టిలో పెట్టుకోవాల్సి ఉంటుంది. కాఫీని మోతాదులో సేవిస్తే తలనొప్పి నుంచి ఉపశమనం పొందవచ్చు. కానీ అధికంగా సేవిస్తే మాత్రం తలనొప్పి ఎక్కువవుతుంది.

ఎంత మోతాదులో..?: కాఫీని రోజూ ఎంత మోతాదులో సేవించాలి.. అని చాలా మంది సందేహం వ్యక్తం చేస్తుంటారు. కాఫీ రోజుకు 2 కప్పులకు మించకూడదు. ఒక కప్పు కాఫీ తాగితే మనకు సుమారుగా 200 మిల్లీగ్రాముల మేర కెఫీన్ లభిస్తుంది. నిపుణులు చెబుతున్న ప్రకారం మనకు రోజుకు 400 మిల్లీగ్రాముల మేర కెఫీన్ సరిపోతుంది. అందువల్ల రోజుకు 2 కప్పుల కాఫీని సేవిస్తే చాలు. అంతకు మించితే అనేక దుష్పరిణామాలను ఎదుర్కోవాల్సి ఉంటుందని వైద్యులు చెబుతున్నారు.

## మెడ నల్లగా మారుతుందా?



వేసవిలో బయట పనులు చేసేవారి మెడ నల్లగా మారిపోతుంటుంది. దీనికి అనేక కారణాలు ఉన్నాయి. ముఖ్యంగా మెడను సరిగ్గా శుభ్రం చేయకపోవడం వల్ల, శరీరంలో ఐరన్ తగ్గడం వల్ల మెడ నల్లగా మారుతుంది. స్థూలకాయం పెరగడం, ఇన్సులిన్ రెసిస్టెన్స్, జన్యుపరమైన కారణాలు, పీసీఓడీ సమస్య, పెర్ఫ్యూమ్ ఎక్కువగా వాడడం వల్ల అలర్జీలు, డయాబెటిస్, హైపో థైరాయిడిజం వల్ల కూడా మెడ నల్లబడుతూ ఉంటుంది. వేసవిలో వచ్చే ఈ సమస్యను ఇలా నివారించుకోవచ్చు. వేసవిలో మెడ నలుపును పోగొట్టుకోవాలంటే మెడపై స్క్రబ్‌తో కప్పుకోవాలి. ఒక గిన్నెలో టూత్‌పేస్ట్ తీసుకొని దానికి కొన్ని చుక్కల నిమ్మరసం వేసి బాగా కలపాలి. ఇప్పుడు ఈ పేస్ట్‌ని మెడలోని నల్లటి భాగంలో బాగా రాయాలి. 10 నిమిషాల పాటు అలా చేసుకుని, ఆపై శుభ్రమైన నీటితో మెడను కడగాలి. వారానికి రెండు సార్లు ఇలా అప్లై చేయడం వల్ల మెడ ముదురు రంగు పోతుంది. ఒక చెంచా శనగపిండిని తీసుకుని, దానికి చిటికెడు పసుపు వేసి,ఒక చెంచా పెరుగు వేసి బాగా కలిపి పేస్ట్‌లా చేసుకోవాలి. ఈ పేస్ట్‌ను మెడపై అప్లై చేసి 20 నిమిషాల పాటు అలాగే ఉంచాలి. 20 నిమిషాల తర్వాత, టవల్ లేదా మెత్తటి వస్త్రంతో మెడను శుభ్రంగా తుడవాలి. ఈ పేస్ట్‌ని వారానికి రెండు సార్లు అప్లై చేయడం వల్ల చర్మం రంగు మెరుగవుతుంది. యాంటీఆక్సిడెంట్ లక్షణాలతో కూడిన కలబంద జెల్‌ను మెడకు పట్టించి కొంతసేపు మసాజ్ చేయాలి. ఈ జెల్‌ను రాత్రి పూట రాసుకుంటే మంచిది. రాత్రంతా మెడపై జెల్ వదిలి ఉదయం కడగాలి.

## రోజూ కొర్రలను ఆహారంలో భాగం చేసుకుంటే

# కలిగే అద్భుతమైన ప్రయోజనాలు

ఆరోగ్యం పట్ల శ్రద్ధ పెరుగుతున్న చాలా మంది పోషకాలు కలిగే ఉండే ఆహారాలను తినేందుకు ఆసక్తిని చూపిస్తున్నారు. అందులో భాగంగానే చాలా మంది మిల్లెట్లను ఆహారంలో భాగం చేసుకుంటున్నారు. వీటినే చిరు ధాన్యాలు లేదా సిరి ధాన్యాలు అని కూడా పిలుస్తారు. మిల్లెట్లను తినడం వల్ల ఎంతగానో ప్రయోజనం ఉంటుందని పోషకాహార నిపుణులు, ప్రకృతి వైద్య నిపుణులు చెబుతుండడంతో మిల్లెట్లకు డిమాండ్ బాగానే పెరిగింది. మిల్లెట్లతో చేసిన అనేక ఆహారాలు, తినుబండారాలు, బిస్కెట్లు వంటివి కూడా మనకు అందుబాటులో ఉంటున్నాయి. అయితే మిల్లెట్లలో వేటికవే అనేక ప్రత్యేకతలను కలిగి ఉన్నా చాలా మంది తింటున్న వాటిలో కొర్రలు ముఖ్య పాత్ర పోషిస్తాయి. మన పూర్వీకులు కొర్రలను అధికంగా తినేవారు. కొర్రలను ఆహారంలో భాగం చేసుకుంటే అనేక ప్రయోజనాలను పొందవచ్చని పోషకాహార నిపుణులు చెబుతున్నారు.

**అనేక పోషకాలు..:** కొర్రలలో అనేక పోషకాలు ఉంటాయి. వీటిల్లో ఉండే కార్బొహైడ్రేట్లు మన శరీరానికి శక్తిని అందిస్తాయి. కొర్రలలో ఉండే ప్రోటీన్లు కండరాలకు శక్తిని అందించి కండరాలు నిర్మాణం అయ్యేలా చూస్తాయి. కొర్రల్లో ఉండే ఫైబర్ జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. ఆకలిని నియంత్రిస్తుంది. షుగర్, కొలెస్ట్రాల్ లెవల్స్‌ను తగ్గిస్తుంది. కొర్రలలో నియాసిన్, థయామిన్, రైబోఫ్లేవిన్ అనే పలు రకాల బి విటమిన్లు సమృద్ధిగా ఉంటాయి. ఐరన్, మెగ్నిషియం,



ఫాస్ఫరస్, పొటాషియం, క్యాల్షియం, జింక్, మాంగనీస్ వంటి మినరల్స్ కూడా కొర్రల్లో సమృద్ధిగా ఉంటాయి. ఇవన్నీ మన శరీరంలో జీవక్రియలు సరిగ్గా నిర్వహించేందుకు దోహదం చేస్తాయి.

**డయాబెటిస్, గుండె జబ్బులకు..:** కొర్రల గ్లైసెమిక్ ఇండెక్స్ (జీఐ) విలువ చాలా తక్కువగా ఉంటుంది. అందువల్ల కొర్రలను తింటే రక్తంలో చక్కెర స్థాయిలు అమాంతం పెరగవు. పైగా వీటిల్లో ఉండే ఫైబర్ షుగర్ లెవల్స్‌ను తగ్గిస్తుంది. కనుక డయాబెటిస్ ఉన్నవారు కొర్రలను తింటుంటే ఎంతో మేలు జరుగుతుంది. కొర్రలలో ఉండే ఫైబర్ చెడు కొలెస్ట్రాల్ (ఎల్‌డీఎల్)ను తగ్గిస్తుంది. మంచి కొలెస్ట్రాల్ (హెచ్‌డీఎల్)ను పెంచుతుంది. దీంతో బీపీ, కొలెస్ట్రాల్ లెవల్స్ నియంత్రణలో ఉంటాయి. ఇది గుండె ఆరోగ్యానికి మేలు చేస్తుంది. హార్ట్ ఎటాక్ రాకుండా చూస్తుంది. కొర్రలలో అధికంగా ఉండే ఫైబర్ కడుపు నిండిన భావనను కలిగిస్తుంది. ఎక్కువ సేపు ఉన్నా ఆకలి వేయదు. దీంతో ఆహారం తక్కువగా తింటారు. ఇది బరువు తగ్గేందుకు సహాయం చేస్తుంది.

**ఎముకల దృఢత్వానికి..:** కొర్రలలో ఉండే ఫైబర్ జీర్ణక్రియను మెరుగు పరుస్తుంది. మలబద్దకాన్ని తగ్గిస్తుంది. మలబద్దకం ఉన్నవారు రాత్రి పూట కొర్రలను తింటుంటే ఎంతో మేలు జరుగుతుంది. కొర్రలలో ఫినోలిక్ సమ్మేళనాలు, ఫ్లేవనాయిడ్స్, టానిన్స్ అనే యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గిస్తాయి. ఫ్రీ ర్యాడికల్స్‌ను నిర్మూలిస్తాయి. దీంతో కణాలకు జరిగే నష్టం నివారించబడుతుంది. ఫలితంగా క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు రాకుండా అడ్డుకోవచ్చు. కొర్రలలో క్యాల్షియం కూడా అధికంగానే ఉంటుంది. ఇది ఎముకలను బలంగా మారుస్తుంది. ఎముకలు విరిగి ఉన్నవారు కొర్రలను ఆహారంలో భాగం చేసుకుంటే ఎముకలు త్వరగా అతుక్కునేలా చేయవచ్చు. ఇలా కొర్రలను తింటే అనేక అద్భుతమైన లాభాలను పొందవచ్చు.

## తాటి ముంజెల్లో మేటి పోషకాలు



ఎటువంటి రసాయనాలు లేకుండా సహజసిద్ధంగా తియ్యని రుచిని ఇచ్చే తాటిముంజెల్లో ఆరోగ్యపోషకాలు ఎక్కువగా ఉంటాయి. తాటి ముంజెల్లో విటమిన్ బి-7, విటమిన్-కె, కరిగే ఫైబర్, పొటాషియం, కాల్షియం, విటమిన్-ఎ, విటమిన్-సి, విటమిన్-డి, జింక్, ఐరన్, పోషకాలు ఉంటాయి.నీటిశాతం ఎక్కువగా ఉండటం వల్ల వేసవిలో వడదెబ్బ తగలకుండా వుంటుంది. శరీర ఉష్ణోగ్రతను తగ్గించి శరీరాన్ని చల్లబరుస్తాయి. డీహైడ్రేషన్ బారిన పడకుండా చేస్తాయి.వీటిలో పొటాషియం పుష్కలంగా ఉంటుంది. రక్తపోటు, గుండె ఆరోగ్యాన్ని నియంత్రించడంలో సహాయపడుతుంది. శరీరంలోని హానికరమైన వ్యర్థాలను తొలగించడంలో అద్భుతంగా పనిచేస్తాయి. వేసవిలో క్రమం తప్పకుండా తీసుకుంటే కాలేయ సంబంధిత సమస్యలు తగ్గుతాయి. తాటి ముంజలు తినడం వల్ల చెడు కొలెస్ట్రాల్ పోతుంది. మంచి కొలెస్ట్రాల్ పెరుగుతుంది. వీటిలోని పోషకాలు జీర్ణ సమస్యలను తగ్గిస్తాయి. వేసవిలో ఎండ వల్ల వచ్చే వికారం, వాంతులు రాకుండా ఉంటాయి. మహిళల్లో రొమ్ము క్యాన్సర్ అవకాశాలను బాగా తగ్గిస్తాయి. వేసవిలో వచ్చే చికున్ గున్యాను నివారిస్తాయి. శరీరాన్ని చల్లగా ఉంచుతాయి. శరీరంలోని అధిక బరువును తగ్గించడంలో ఎంతగానో సహకరిస్తాయి.

# 'ఎరువు' రాయితీ ఎలా?



- సిఎం ప్రకటనపై సందేహాలెన్నో..
- రైతుల ఆందోళనల వేడి చల్లార్చేందుకేనన్న వాదన
- వైఫల్యాలను కప్పిపుచ్చుకొనేందుకేనన్న విమర్శలు

**అమరావతి,తెలంగాణ దిశ :**యూరియా సహా అన్ని రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించే రైతులకు నగదు ప్రోత్సాహకం అందజేస్తామన్న టిడిపి కూటమి ప్రభుత్వ ప్రకటన చర్చనీయాంశంగా మారింది. ఎరువులకు కేంద్రం విధించిన కోతలు, ఎరువుల సరఫరాలో ప్రభుత్వ వైఫల్యాలపై అన్నదాతల్లో నెలకొన్న ఆగ్రహావేశాలు, అసంతృప్తులను తగ్గించడానికి, ప్రస్తుతం నెలకొన్న వేడిని చల్లార్చడానికే సిఎం ఆ ప్రకటన చేశారని తెలుస్తోంది. రైతు ఎంతైతే ఎరువుల వినియోగాన్ని తగ్గిస్తాడో, ఆ మేరకు బస్తాకు రూ.800 వంతున నగదు బదిలీ చేయనున్నట్లు సోమవారంనాటి కలెక్టర్ల కాన్ఫరెన్స్లో ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. దానికి సంబంధించి త్వరలో విధి, విధానాలు రూపొందించాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. కాగా సిఎం ప్రకటన వెనుక ఎలాంటి నిర్దిష్ట కసరత్తు చేయలేదని, ప్రభుత్వంలో ప్రాథమిక స్థాయిలో కూడా చర్చ జరగలేదని సమాచారం. అందుకే ఏ ఎరువు వాడకాన్ని తగ్గిస్తే రూ.800 ఇస్తారో స్పష్టత కరువైంది. ప్రస్తుతం రాష్ట్రంలో ఫోకస్ అంతా యూరి యాపైనే ఉంది. యూరియా సరఫరాలో ప్రణాళికా రహితంగా ఉన్నారంటూ ప్రభుత్వ వైఫల్యాన్ని సిఎం ఒక మేరకు అంగీకరించారు. యూరియాకే ఎక్కువ సమస్య ఏర్పడింది. కేంద్రం నుంచి అదనుకు యూరియా సరఫరా కానందువల్లనే కొరత వచ్చింది.

పిఎం ప్రణామ్ లో భాగమే: ఎరువుల సబ్సిడీని తగ్గించుకునేందుకు 2023 జూన్లో మోడీ సర్కార్ 'పిఎం-ప్రణామ్' స్కీంకు రూపకల్పన చేసింది. అంతకుముందటి మూడేళ్ల ఎరువుల వినియోగం సగటును గణించి, దానిలో కనీసం పది శాతం వినియోగం తగ్గించాలన్నది లక్ష్యం. ఆ విధంగా ఎంతైతే వినియోగం తగ్గించి సబ్సిడీని ఆదా చేస్తారో, ఆ అమౌంట్ లో సగ భాగాన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు గ్రాంట్గా ఇస్తామంది. దేశ వ్యాప్తంగా ఏడాదికి కేంద్రం ఎరువుల సబ్సిడీ రూ.20 వేల కోట్లు తగ్గించుకోవాలన్నది టార్గెట్. 2023-24, 2024-25, 2025-26.. ఈ మూడేళ్లూ పిఎం ప్రణామ్ అమలులో ఉంటుంది. భవిష్యత్తులో కూడా కొనసాగుతుంది. వీలైన మేరకు ఎరువుల వాడకాన్ని తగ్గించి కేంద్రం నుంచి గ్రాంట్ పొందాలని ఎపి పోటీ పడుతున్నట్లు సమాచారం. ఈ విషయం బయటికి పొక్కేసరికి, కేంద్రం నుంచి వచ్చే గ్రాంట్లో కొంత మొత్తాన్ని రైతులకు నగదు బదిలీ చేస్తామంటే రైతుల్లో ఆందోళన, వ్యతిరేకత తగ్గుతుందని కూటమి సర్కార్ ఎత్తు వేసిందని అనుకుంటున్నారు.

బేస్ లేదు: రైతు ఎంత మేర ఎరువుల వాడకాన్ని తగ్గించాడో నిర్ణయించడానికి డేటా, మెకానిజం ప్రశ్నార్థకంగా మారింది. ఏ ప్రాంతంలో ఏ పంటకు ఎంత ఎరువు ఏ ఎరువు వేయాలన్న వ్యవసాయ వర్శిటీలు, ఐసిఎఆర్ సూచనలను పరిశీలించి, దానికి ఎంత తగ్గించారో డేటా నమోదు చేస్తారని ప్రచారం సాగుతోంది. ప్రస్తుతానికి డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్ఫర్ (డిబిటి) గణాంకాలే సరిగ్గా లేవు. వెబ్ల్యాండ్ ఆధారంగా ఇ-క్రాప్ లింక్ అంటున్నా పంటలు వేశాక ఆ నమోదులు జరుగుతున్నాయి. ఇ-క్రాప్ అనేది ఆచరణసాధ్యం కాదన్నది వాదన. రాష్ట్రంలో కౌలు వ్యవసాయం గణనీయంగా ఉంది. లక్షల ఎకరాలను లక్షలాది కౌలు రైతులు సాగు చేస్తున్నారు. ఇ-క్రాప్లో వారి పేర్లు నమోదు కావు.

వాస్తవ సాగుదారులే ఎరువులు వినియోగిస్తారు. వారందరికీ నగదు ప్రోత్సాహకం ప్రశ్నార్థకం. పిఎం-ప్రణామ్లో యూరియాతో పాటు డిఎపి, ఎంఒపి, ఎస్ఎస్పి, ఎన్పికె (కాంప్లెక్స్ ఎరువులను తగ్గించాలన్నది టార్గెట్. సిఎం చంద్రబాబు యూరియాను దృష్టిలో పెట్టుకొనే బస్తాకు రూ.800 అన్నారన్నది అధికారుల మాట. కేంద్రం యూరియాపై బస్తాకు రూ.1,700 సబ్సిడీ ఇస్తోంది కాబట్టి దానిలో సగం రైతుకు ఇన్సెంటివ్ ఇవ్వాలంటున్నారని తెలిసింది. మరి మిగతా ఎరువుల పరిస్థితేంటన్న ప్రశ్నలొస్తున్నాయి. ఎరువులను తగ్గించే రైతులకు క్యాష్ ఇన్సెంటివ్ అన్న చంద్రబాబు ప్రకటన అటు ప్రభుత్వం, అధికారుల్లో ఇటు రైతుల్లో గందరగోళానికి దారి తీసింది.

## భారత్ నుంచి డీజిల్ దిగుమతులపై ఉక్రెయిన్ ఆంక్షలు

న్యూఢిల్లీ, : భారతదేశం నుంచి చేసుకుంటున్న డీజిల్ దిగుమతులపై ఆంక్షలు విధించాలని ఉక్రెయిన్ నిర్ణయించింది, అక్టోబర్ 1 నుంచి ఇది అమలులోకి రానుంది. రష్యా నుంచి ముడి చమురుపై ఆధారపడటంపై ఆందోళనలు చెలరేగాయి. ఉక్రేనియా ఎనర్జీ కన్సల్టెన్సీ ఎన్కోర్ ప్రకారం.. ఉక్రేనియా భద్రతా సంస్థలు భారతదేశం నుంచి వచ్చే ప్రతి డీజిల్ దిగుమతిని రష్యా మూలమైన భాగాలను గుర్తించడానికి ప్రయోగశాల పరీక్షలు చేపట్టాలని ఆదేశించాయని కన్సల్టెన్సీ పేర్కొంది., శక్తి కన్సల్టెన్సీ ం-95 గతంలో ఈ వేసవిలో ఒక ప్రధాన ఉక్రేనియా చమురు శుద్ధి కర్మాగారం మూసివేయడంతో ఇంధన వ్యాపారులు విదేశీ సరఫరాదారులపై ఆధారపడవలసి వచ్చిందని పేర్కొంది. రష్యా ముడి చమురును గణనీయమైన పరిమాణంలో శుద్ధి చేసే దేశాల్లో భారతదేశం ఒకటి. ం-95 ప్రకారం, ఉక్రెయిన్ రక్షణ మంత్రిత్వ శాఖ కూడా ఒకానొక సమయంలో భారత్ నుంచి దిగుమతి చేసుకునే డీజిల్ను సేకరించింది. ఎందుకంటే ఇది సోవియట్ అనంతర సాంకేతిక ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నట్లు గుర్తించారు.ఎన్కోర్ గణాంకాల ప్రకారం, ఒక్క ఆగస్టులోనే ఉక్రెయిన్ దేశం భారత్ నుండి 119,000 టన్నుల డీజిల్ను దిగుమతి చేసుకుంది. ఆ నెలలో మొత్తం డీజిల్ దిగుమతుల్లో ఇది 18 శాతం వాటా అని రాయిటర్స్ నివేదించింది. 2022లో రష్యా పూర్తిస్థాయి దాడిని ప్రారంభించే ముందు, పరిమిత దేశీయ ఉత్పత్తిని భర్తీ చేయడానికి ఉక్రెయిన్ బెలారస్, రష్యా నుంచి ముడి చమురు, ఇంధన దిగుమతులపై ఎక్కువగా ఆధారపడింది. అయితే, యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి ఉక్రెయిన్ ప్రధానంగా పశ్చిమ ఐరోపాలోని దేశాలపై ఆధార పడుతోంది. ం-95 ప్రకారం, 2025 మొదటి అర్ధభాగంలో ఉక్రెయిన్లోకి మొత్తం డీజిల్ దిగుమతులు 13 శాతం తగ్గి, 2.74 మిలియన్ మెట్రిక్ టన్నులకు చేరుకున్నాయి. ఉక్రేనియా చమురు శుద్ధి కర్మాగారాలు, నిల్వ సౌకర్యాలను లక్ష్యంగా చేసుకుని రష్యన్ డ్రోన్ దాడులు, క్షిపణి దాడులు కొనసాగుతున్న క్రమంలో ఈ ఆంక్షలు వచ్చాయి.ఉక్రేనియా డ్రోన్లు రష్యా వాయువ్య ప్రాంతంలోని కిరిషి చమురు శుద్ధి కర్మాగారంపై ఆదివారం నాడు దాడి చేశాయి. ఇది దేశంలోనే అతి రిఫైనరీ. డ్రోన్ దాడులతో మంటలు చెలరేగాయని ఫ్రాన్స్ 24 నివేదించింది. సుర్గుట్నెఫ్టెగాజ్ లోని కిరిషినెఫ్టోర్గ్సింతేజ్ రిఫైనరీ రష్యాలోని అతిపెద్ద రెండు రిఫైనరీలలో ఒకటి. ఉక్రేనియా డ్రోన్లు దాన్ని లక్ష్యంగా చేసుకున్నాయని రష్యన్ అధికారులు కూడా ధృవీకరించారు. ముడిచమురు శుద్ధి కర్మాగారంపై దాడి చేసినట్లు ఉక్రెయిన్ డ్రోన్ కమాండ్ పేర్కొంది.

# ఆర్థిక బాధ్యత ఇద్దరిదీ...




కుటుంబం ఆర్థికంగా బాగుండాలంటే దంపతులిద్దరూ ఒక్క మాటపై ఉండాలి. డబ్బు విషయంలో ఇద్దరి మనసులో పొదుపు చేయాలని ఉంటే, కచ్చితంగా ఆ కుటుంబానికి ఆర్థిక సమస్యలు రావు. అయితే ప్రణాళికలు ఎలా వేసుకోవాలో చాలామందికి తెలియదు. ముఖ్యంగా కొత్తగా పెండ్లయిన దంపతులకు ఈ విషయంలో అవగాహన అంతంత మాత్రమే! అలాంటి వాళ్లు కొన్ని ఆర్థికపరమైన విషయాలు తెలుసుకుంటే మంచిది. కొత్త దంపతులు పెండ్లికి ముందు తమ ఆర్థిక పరిస్థితులు ఎలా ఉండేవో చర్చించుకోవాలి. అలాగే తమ అప్పులు, ఆస్తులు, పొదుపు చేసిన డబ్బు, అలవాట్లు, ఖర్చుల గురించి ఒకరికొకరు మాట్లాడుకోవాలి.ఇద్దరూ కలిసి డబ్బుపై ఒక అభిప్రాయానికి రావాలి. దాని విలువ గురించి చర్చించుకోవాలి. తర్వాత భవిష్యత్తు కోసం కొన్నిలక్ష్యాలను పెట్టుకోవాలి. అందులో షార్ట్ టర్మ్, లాంగ్ టర్మ్ గోల్స్ ఉండేలా చూసుకోవాలి. చిన్నచిన్న ఔటింగ్స్, కొత్త ఫోన్లు, కంప్యూటర్ల కొనుగోలు, ఎమర్జెన్సీ ఫండ్స్ వాటిని షార్ట్ టర్మ్ గోల్స్గా ఫిక్స్ చేసుకోవాలి. సొంతిల్లు, రిటైర్మెంట్ ప్లాన్స్ లాంటివి లాంగ్ టర్మ్ గోల్స్గా నిర్దేశించుకోవాలి. అనుకున్న లక్ష్యాలను అందుకునే దిశగా ప్రణాళికలు అమలుచేయాలి. భార్యాభర్తల మధ్య రహస్యాలు ఉండకపోవడం మంచిది. ముఖ్యంగా ఆర్థికపరమైన అంశాల్లో దాచివేతలు, దాటవేతలు భవిష్యత్తులో సమస్యాత్మకంగా పరిణమించే ప్రమాదం ఉంది. అందువల్ల ఆదాయం, పెట్టుబడి, అప్పుల విషయంలో ఇద్దరి మధ్య పారదర్శకత ఉండాలి. అప్పుడే వాళ్లలో నమ్మకం అనే బలమైన పునాది ఏర్పడుతుంది.ఆటుపోట్లు అందరికీ సహజం.

# మెట్రో ప్లాట్ ఫాంల వద్ద స్టీల్ గ్రిల్స్



**హైదరాబాద్,తెలంగాణ దిశ :** హైదరాబాద్ మెట్రో రైల్ కార్పొరేషన్ కీలక నిర్ణయం తీసుకుంది. మెట్రో ప్లాట్ఫామ్ల వద్ద స్టీల్ గ్రిల్స్ ఏర్పాటు చేయాలని భావిస్తోంది. మెట్రో ప్రయాణికులకు ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. మొదట కొన్ని ఎంపిక చేసిన మెట్రో స్టేషన్లలో ఈ స్టీల్ గ్రిల్స్ ఏర్పాటు చేసి.. ఆ తర్వాత క్రమంగా అన్ని స్టేషన్లకు విస్తరించాలని చూస్తోంది. రానున్న రెండున్నర ఏళ్లలో హైదరాబాద్లోని అన్ని మెట్రో స్టేషన్లలో ఈ స్టీల్ గ్రిల్స్ అందుబాటులోకి రానున్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి.ప్రయాణికులకు భద్రత కోసం హైదరాబాద్ మెట్రో రైల్ కార్పొరేషన్.. అనేక చర్యలు చేపడుతోంది. నిత్యం ఆఫీసులు, స్కూళ్లు, కాలేజీలు, ఇతర పనుల కోసం మెట్రోలో ప్రయాణించేవారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది.ఈ నేపథ్యంలోనే రద్దీ సమయాల్లో మెట్రో స్టేషన్లు.. ప్రయాణికులతో కిక్కిరిసిపోతున్నాయి. నిత్యం మెట్రో రైళ్లలో లక్షలాది మంది ప్రయాణిస్తున్నారు.

దీంతో కాలు పెట్టడానికి కూడా వీలు లేకుండా స్టేషన్లు, ప్లాట్ఫామ్లు నిండిపోతు న్నాయి. దీంతో ప్రయాణికులకు ఎలాంటి ప్రమాదాలు జరగకుండా మెట్రో అధికారులు చూస్తున్నారుఇక మెట్రో రైలు వచ్చే సమయంలో ప్లాట్ఫామ్పైకి వస్తున్న ప్రయాణికుల మధ్య తోపులాటలు చోటు చేసుకుంటుండటంతో.. వారు రైలు పట్టాలపై పడే ప్రమాదం ఉంది. ఇలాంటి ప్రమాదాలు జరగకుండా మెట్రో అధికారులు ముందుగానే అలర్ట్ అవుతున్నారు. మెట్రో ప్లాట్ఫామ్లపై స్టీల్ గ్రిల్స్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. మెట్రో రైలు డోర్ల వద్ద కాకుండా కోచ్ల పొడవునా.. ప్లాట్ఫామ్పై ఈ ఉక్కు కంచెను ఏర్పాటు చేయనున్నారు.మొదట కొన్ని స్టేషన్లలో ఈ స్టీల్ గ్రిల్స్ను ఏర్పాటు చేసి.. అవి ఏ రకంగా పనిచేస్తున్నాయో చూసి..

ఆ తర్వాత క్రమంగా మిగిలిన స్టేషన్లకు విస్తరించాలని భావిస్తున్నారు. వచ్చే రెండున్నర సంవత్సరాల్లో నగరవ్యాప్తంగా అన్ని స్టేషన్లలోనూ ఈ స్టీల్ గ్రిల్స్ తీసుకురావాలని యోచిస్తున్నారు.

అయితే ఈ స్టీల్ గ్రిల్స్ ఏర్పాటు చేయడం పట్ల ప్రయాణికులు, నెటిజన్ల నుంచి భిన్న స్వరాలు వినిపిస్తు న్నాయి. మెట్రో రైలు వద్ద గ్రిల్స్ ఏర్పాటు చేయడం వల్ల.. తోపులాటలు జరిగినా ప్రయాణికులు పట్టాలపై పడి ప్రాణాలు కోల్పోవడం, గాయాల పాలు కాకుండా ఉంటుందని కొందరు పే ర్కొంటున్నారు.

## మినిట్మ్యాన్-3 క్షిపణి ప్రయోగం

### శక్తిమంతమైన క్షిపణిని పరీక్షించిన అమెరికా

కాలిఫోర్నియా: అంతర్జాతీయంగా ఉద్రిక్తతలు పెరుగుతున్న వేళ, అమెరికా తన అణు సామర్థ్యాన్ని మరోసారి ప్రపంచానికి చాటిచెప్పింది. కాలిఫోర్నియాలోని వాండెన్బర్గ్ స్పేస్ ఫోర్స్ బేస్ నుంచి నవంబర్ 5న 'మినిట్మ్యాన్-3' అనే ఖండాంతర బాలిస్టిక్ క్షిపణిని విజయవంతంగా పరీక్షించింది. ఇది కేవలం ఆయుధ వ్యవస్థల విశ్వసనీయతను అంచనా వేయడానికి చేపట్టిన రొటీన్ పరీక్ష అని అధికారులు ప్రకటించినప్పటికీ, దీని వెనుక బలమైన వ్యూహాత్మక కారణాలు ఉన్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు. యూఎస్ ఎయిర్ ఫోర్స్ గ్లోబల్ స్ట్రైక్ కమాండ్ ఈ ప్రయోగాన్ని ధ్రువీకరించింది.

ఈ క్షిపణి సుమారు 7,500 కిలోమీటర్లు ప్రయాణించి, పసిఫిక్ మహాసముద్రంలోని మార్షల్ దీవుల సమీపంలో ఉన్న రోనాల్డ్ రీగన్ బాలిస్టిక్ మిస్సైల్ డిఫెన్స్ టెస్ట్ సైట్లోని లక్ష్యాన్ని కచ్చితత్వంతో ఛేదించిందని అధికారులు తెలిపారు. ఇది కేవలం వ్యవస్థల పనితీరు, వేగం, కచ్చితత్వాన్ని అంచనా వేయడానికి చేపట్టిన రొటీన్ పరీక్ష అని,ఇందులో ఎలాంటి అణు వార్హెడ్లు ఉపయోగించలేదని పెంటగాన్ స్పష్టం చేసింది. రష్యా, చైనా, పాకిస్థాన్ వంటి దేశాలు అణు పరీక్షలు నిర్వహిస్తున్నాయని, ఈ పోటీలో అమెరికా వెనుకబడకూడదన్న ఉద్దేశంతో అధ్యక్షుడు ట్రంప్ ఈ పరీక్షలకు ఆదేశించినట్లు తెలుస్తోంది. ఎలాంటి పేలుడు పదార్థాలతో కూడిన అణు పరీక్షలు నిర్వహించ బోమని అమెరికా ఇంధన శాఖ స్పష్టం చేసినప్పటికీ, ఈ ప్రయోగం ప్రచ్ఛన్నయుద్ధ కాలం నాటి అణు పోటీని గుర్తుచేస్తోందని నిపుణులు అంటున్నారు.మినిట్మ్యాన్-3 అమెరికా అమ్ములపొదిలో అత్యంత పురాతనమైన, భూమి నుంచి ప్రయోగించే ఖండాంతర బాలిస్టిక్ క్షిపణి. 1970ల నుంచి ఇది సేవలో ఉంది. నిమిషం వ్యవధిలోనే ప్రయోగించ గలదు కాబట్టే దీనికి ఆ పేరు వచ్చింది. ఇది సుమారు 13,000 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను కూడా ఛేదించగలదు. ప్రస్తుతం అమెరికా వద్ద ఇలాంటివి 400 క్షిపణులు ఉన్నాయి. 2030 నాటికి వీటి స్థానంలో కొత్త క్షిపణులను ప్రవేశపెట్టాలని అమెరికా యోచిస్తోం ది.ఈ ప్రయోగం అణ్వాయుధాల భయానక విధ్వంసాన్ని మరోసారి గుర్తుచేస్తోంది. ప్రస్తుతం అమెరికా వద్ద ఉన్న అత్యంత శక్తిమంతమైన %దీ%83 అణు బాంబు సామర్థ్యం 1.2 మెగాటన్నులు. అంటే హిరోషిమా బాంబు కంటే 80 రెట్లు ఎక్కువ. ఇదిఒక నగరంపై పడితే 10-15కిలోమీటర్ల పరిధిలోని ప్రతిదీ బూడిదై పోతుంది. ఇటీవల, ప్రపంచాన్ని 150 సార్లు నాశనం చేయగల అణ్వాయుధాలు తమ వద్ద ఉన్నాయని అధ్యక్షుడు ట్రంప్ చేసిన వ్యాఖ్యలు కలకలం రేపాయి. నిపుణుల అంచనా ప్రకారం, నాగరికతను నాశనం చేయడానికి 100-400 అణు వార్హెడ్లు చాలు. ఈ నేపథ్యంలో, మినిట్మ్యాన్-3 వంటి పరీక్షలు ఒకవైపు అమెరికా సైనిక సన్నద్ధతను చాటుకోవడానికే కాకుండా, ప్రత్యర్థి దేశాలకు ఒక హెచ్చరికగా కూడా ఉపయోగపడతాయని విశ్లేషకులు భావిస్తున్నారు.

## రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు మున్సిపాలిటీ వారి వినూత్న కార్యక్రమం..




**జమ్మికుంట,తెలంగాణ దిశ :**జమ్మికుంట, నుండి హుజూరాబాద్ వైపుగా వెళ్ళే దారిలో డివైడర్స్ కు వాహనదారులు తగిలి ప్రమాదాలు జరుగుతున్నాయని గ్రహించి సాలిడ్ వేస్ట్ రూల్స్ ప్రకారం రెడ్యూస్, రియూస్, రీసైక్లింగ్ నుండి జమ్మికుంట మున్సిపా లిటి వాహనాలకు ఉపయోగం లేని వాహనాల టైర్లతో డివైడర్స్ కు కొటేషన్ లతో గొప్ప కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జమ్మికుంట నుండి హుజూరా బాద్కు వెళ్లే డివైడర్స్ సమీపంలోచాలా రోడ్డు ప్రమాదాలు జరిగాయని, వాటిని అరికట్టేందుకు మున్సిపల్ వాహనాల ఉపయోగం కానీ టైర్లను డివైడర్లకు రంగులతో ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. పనికిరాని టైర్లను రీయూజ్ చేసి ఇటువంటి ప్రజల ప్రాణాలు కాపాడేందుకు ఉపయోగపడుతున్నందుకు సంతోషం వ్యక్తం చేశారు.

## ప్రజల జీవన స్థితిగతులపై జాతీయ గణాంక శాఖ సర్వే

**రామగుండం,తెలంగాణ దిశ :** రామగుండం కార్పొరేషన్ ప్రజల జీవన స్థితిగతులపై జాతీయ గణాంక శాఖ సర్వే నిర్వహిస్తున్నట్లు గణాంక శాఖ అధికారి గుర్రం శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. ఇంచార్జ్ కమిషనర్ అరుణశ్రీని రామగుండం మున్సిపల్ ఆఫీసులో గుర్రం శ్రీనివాస్ గౌడ్ కలిసి సర్వేకు సంబంధిం చినటువంటి కరపత్రాలను అందించి సర్వే ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా గుర్రం శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా ఎంపిక చేసిన పట్టణాలలో రామగుండంఉందని పట్టణా లు గ్రామాలలో ప్రజల ఉపాధి స్థితిగతులపై సర్వే చేసినట్లు తెలిపారు. ప్రజల ఉపాధి స్థితిగతులపై నిర్వహిస్తున్న సర్వేలో భాగంగా రామగుండం పట్టణంలో సర్వే ప్రారంభించామని గణంకశాఖ అధికారి గుర్రం శ్రీనివాస్ గౌడ్ తెలిపారు

## మొక్కల సంరక్షణలో తగు జాగ్రత్తలు తీసుకోవాలి

### వరి ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి పెగడపల్లి ఎంపీడీఓ ప్రేమ్ సాగర్

**పెగడపల్లి,తెలంగాణ దిశ :** మొక్కల సంరక్షణలో తగు జాగ్రత్తలు, మెలకువలు తీసుకొని మొక్కలను సంరక్షించాలని, కొనుగోలు కేంద్రాలలో నిల్వ ఉన్న వరి ధాన్యం ఒంగోలను వేగవంతం చేయాలని సిబ్బందికి పెగడపల్లి ఎంపీడీఓ ఇ. ప్రేమ్ సాగర్ ఆదేశించారు. జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలంలోని రాజారాంపల్లి, కీచులాటపల్లి , ఎల్లాపూర్ గ్రామాలను మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఇ. ప్రేమ్ సాగర్సందర్శించి ఆయా గ్రామాల్లోని నర్సరీలను, పల్లె ప్రకృతి వనాలను, వడ్ల కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. మొక్కల సంరక్షణలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వన సేవకులకు, క్షేత్ర సహాయకులకు పలు సూచనలు చేశారు.



## వేసవిలో ఎండ వేడి, ఎండ దెబ్బను తప్పించుకోవాలంటే..

# జాగ్రత్తలు పాటించడం తప్పనిసరి..

వేసవి కాలం మొదలవడంతో వడగాలుల తీవ్రత పెరిగి శరీరంపై తీవ్రమైన ప్రభావం చూపే అవకాశాలు ఎక్కువవుతున్నాయి. ముఖ్యంగా అధిక ఉష్ణోగ్రతలు వరుసగా కొన్ని రోజులు కొనసాగితే శరీరం తన అంతర్గత ఉష్ణోగ్రతను సమతుల్యం చేయడానికి ఎక్కువగా శ్రమిస్తుంది. చెమట పట్టడం, రక్త ప్రసరణ పెరగడం ద్వారా శరీరం చల్లబడేందుకు ప్రయత్నిస్తుంది. అయితే రోజువారీ అలవాట్లలో కొన్ని పొరపాట్లు ఈ ప్రక్రియను మరింత కష్టతరం చేస్తాయి. ఒక అధ్యయనం ప్రకారం వడగాలులు ముఖ్యంగా వృద్ధులు, పిల్లల్లో మరణాల ముప్పును పెంచడంతో పాటు ఆందోళన, నిరాశ వంటి మానసిక సమస్యలకు కూడా కారణమవుతాయి. కాబట్టి హీట్ ఎగ్జాషన్, హీట్ స్ట్రోక్ వంటి సమస్యలను నివారించాలంటే కొన్ని జాగ్రత్తలు తప్పనిసరి అని వైద్యులు సూచిస్తున్నారు.

మధ్యాహ్నం తరువాత బయటకు వద్దు..: వడగాలుల సమయంలో ఎక్కువగా జరిగే పొరపాటు నీరు తక్కువగా తాగడం. చెమట ద్వారా శరీరం ఎక్కువ నీటిని కోల్పోతుంది. ఈ నీటిని భర్తీ చేయకపోతే డీహైడ్రేషన్ సమస్య వస్తుంది. దీని వల్ల తల తిరగడం, తలనొప్పి, అలసట, దృష్టి లోపం వంటి సమస్యలు తలెత్తుతాయి. కాబట్టి రోజంతా తరచుగా నీరు తాగడం అవసరం. అలాగే మధ్యాహ్నం, ఆ తరువాతి గంటలు రోజులో అత్యధిక ఉష్ణోగ్రతలు ఉండే సమయం. ఈ సమయంలో ఎక్కువసేపు బయట గడపడం హీట్ సంబంధిత సమస్యల ముప్పును పెంచుతుంది. వీలైనంత వరకు ఈ సమయంలో బయటకు వెళ్లకుండా, చల్లని ప్రదేశాల్లో ఉండటం మంచిది. అదే విధంగా దుస్తులు కూడా శరీర ఉష్ణోగ్రత నియంత్రణలో కీలక పాత్ర పోషిస్తాయి. బిగుతైన దుస్తులు, గాఢ రంగులు వేడిని ఎక్కువగా నిల్వ చేస్తాయి. దీంతో చర్మానికి గాలి సరిగా అందదు. తేలికపాటి, లూజ్‌గా ఉండే, లైట్ కలర్ దుస్తులు ధరించడం ద్వారా శరీరం సులభంగా చల్లబడుతుంది.

ఆహారం మానేయకూడదు..: అంతేకాకుండా చెమట, కండరాల నొప్పులు, వికారం, తల తిరగడం వంటి లక్షణాలు శరీరం వేడిని తట్టుకోలేకపోతున్న సంకేతాలు. ఈ లక్షణాలను చాలా మంది నిర్లక్ష్యం చేస్తారు. వీటిని నిర్లక్ష్యం చేస్తే పరిస్థితి తీవ్రమై హీట్ స్ట్రోక్‌కు దారితీయవచ్చు. కనుక ఈ లక్షణాలను గమనించిన వెంటనే వైద్యుడిని సంప్రదించడం మంచిది. అలాగే కాఫీ, మద్యం వంటి పానీయాలు శరీరంలో నీటి నష్టాన్ని పెంచుతాయి. దీంతో డీహైడ్రేషన్ మరింత పెరుగుతుంది. వీటి బదులు నీరు, తాజా జ్యూసులు, ఎలక్ట్రోలైట్ పానీయాలు తీసుకోవడం మంచిది. ఎండలో ఆకలి తగ్గడం సహజం. కానీ పూర్తిగా ఆహారం మానేయడం సరైంది కాదు. శరీరానికి అవసరమైన పోషకాలు అందకపోతే శక్తి తగ్గిపోతుంది. పండ్లు, కూరగాయలు, నీరు ఎక్కువగా ఉండే ఆహారం తీసుకోవడం వంటివి చేయాలి.

ఎక్కువ వేడి ఉన్న సమయంలో కఠినమైన వ్యాయామం లేదా శారీరక శ్రమ చేయడం శరీర ఉష్ణోగ్రతను వేగంగా పెంచుతుంది. అవసరమైతే ఉదయం లేదా సాయంత్రం సమయంలో మాత్రమే వ్యాయామం చేయడం సురక్షితమని వైద్యులు సూచిస్తున్నారు. అలాగే పిల్లలు, వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నవారు వేడికి ఎక్కువగా ప్రభావితమవుతారు. వీరిని వేడి ప్రదేశాల్లో ఉంచడం, నీరు తాగించకపోవడం ప్రమాదకరం. వీరు ఎప్పుడూ చల్లని ప్రదేశాల్లో ఉండేలా చూసుకోవాలి.

వడగాలులతో తీవ్రమైన ముప్పు..: వడగాలులు ఆరోగ్యానికి తీవ్రమైన ముప్పు కలిగించవచ్చు. అయితే సాధారణ జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా ఈముప్పును తగ్గించవచ్చు. తగినంత నీరు తాగడం, ఎండలో బయటకు వెళ్లడాన్ని తగ్గించడం, సరైన దుస్తులు ధరించడం, శరీరం ఇచ్చే సంకేతాలను గమనించడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. రోజువారీ అలవాట్లలో చిన్న మార్పులు చేసుకుంటే, అధిక ఉష్ణోగ్రతలను శరీరం సులభంగా తట్టుకోగలదు. జీవనశైలిలో ఈ మార్పులు చేసుకోవడం వల్ల హీట్ స్ట్రోక్ కు గురి కాకుండా మనల్ని మనం కాపాడుకోవచ్చునని వైద్యులు తెలియజేస్తున్నారు.

## మరోమారు స్వల్పంగా తగ్గిన బంగారం ధరలు



న్యూఢిల్లీ: పసిడి ప్రియులకు శుభవార్త. పశ్చిమాసియా యుద్ధం కారణంగా బంగారం, వెండి ధరలు ఎలా ఉంటాయోనని భయాందోళన చెందుతున్న తరుణంలో మగువలకు తీపికబురు. నిన్నటి రోజున భారీగా పెరిగిన బంగారం, వెండి ధరలు.. కొన్ని గంటల వ్యవధిలోనే భారీగా తగ్గాయి. పెళ్లిళ్లు, శుభకార్యాల సమయంలో భారీ ఊరట లభించింది. తులం గోల్డ్‌పై రూ.1,530 తగ్గగా.. కిలో వెండిపై రూ.5,000 తగ్గింది. తులం గోల్డ్‌పై రూ.1,530 తగ్గడంతో బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,51,420 దగ్గర ట్రేడ్ అవుతోంది. ఇక 22 క్యారెట్ల 10 గ్రాముల ధరపై రూ.1,400 తగ్గడంతో రూ.1,38,800 దగ్గర అమ్ముడవుతోంది. ఇక 18 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధరపై రూ.1,440 తగ్గడంతో రూ.1,13,570 దగ్గర ట్రేడ్ అవుతోంది. సిల్వర్ ధర కూడా భారీ దిగొచ్చింది. కిలో వెండిపై ఏకంగా రూ.5,000 తగ్గింది. దీంతో బులియన్ మార్కెట్‌లో కిలో వెండి ధర రూ.2,50, 000 దగ్గర అమ్ముడవుతోంది. హైదరాబాద్, చెన్నైలో మాత్రం కిలో వెండి ధర రూ.2,55,000 దగ్గర ట్రేడ్ అవుతోంది. ఢిల్లీ, కోల్‌కతా, ముంబై, బెంగళూరులో మాత్రం కిలో వెండి ధర రూ.2,50, 000 దగ్గర అమ్ముడవుతోంది.

## ఈ వేసవిలో మండుటెండలు ఖాయం



ఈ మూడు నెలల్లో ఎక్కువ రోజులు వడగాడ్పులు వీయనున్నాయి. ఏప్రిల్‌లోసగటున మూడు, నాలుగురోజులు, మే, జూన్ నెలల్లో పది, అంతకంటే ఎక్కువ రోజులు వడగాడ్పులు వీస్తాయి. రాత్రి వాతావర ణం కూడా వేడిగానే ఉండనుంది.దేశంలోని 95 శాతం ప్రాంతాల్లో రాత్రి ఉష్ణోగ్రతలు సగటు కంటే ఎక్కువగా నమోదవుతాయి. ఎక్కువ రోజులు వడగాడ్పులు వీస్తాయి. ఏప్రిల్‌లో రాష్ట్రంలోని గోదావరి జిల్లాలు తప్ప మిగిలిన ప్రాంతాల్లో పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు సగటు కంటే ఎక్కువగా నమోదవుతాయి. ఇక ఏప్రిల్‌లో ఈశాన్య రాష్ట్రాలు తప్ప దేశంలోని అనేక ప్రాంతాల్లో సగటు కంటే ఎక్కువ వర్షపాతం నమోదుకానుంది. మార్చిలో సాధారణ వర్షపాతం 29.9 మిల్లీమీటర్లకుగాను 33.7 మిల్లీమీటర్లు నమోదైంది. 1901 నుంచి ఇప్పటి వరకు మార్చిలో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోద వడం ఇది 32వ సారి. పసిఫిక్ మహాసముద్రంలో లానినా చివరిదశకు చేరుకుంది. కొద్దిరోజుల్లో తటస్థ పరిస్థితులకు చేరుకునే అవకాశం ఉందని అంతర్జాతీయ మోడల్స్ వెల్లడిస్తున్నాయి. దీనికి అనుగుణంగా ఏప్రిల్ నుంచి జూన్ వరకు తటస్థ పరిస్థితులు కొనసాగుతాయని, జూన్(నైరుతి రుతుపవనాల ప్రారంభం) నుంచే ఎల్‌నినో మొదలవుతుందని ఐఎండీ అంచనా వేసింది.

# అడకత్తెరలో పోక చెక్కలో అమెరికా

న్యూఢిల్లీ, : ఇరాన్ అణ్వాయుధాలు తయారు చేస్తోందని ఆరోపిస్తూ డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌పై యుద్ధం ప్రకటించాడు. కానీ ఇరాన్ ఇస్లామిక్ రిపబ్లిక్‌ను కూలదోయడం అమెరికా దీర్ఘకాలిక లక్ష్యం. వివిధ జాతి, మత వర్గాలను రెచ్చగొట్టి, అంతర్గత అస్థిరత సృష్టించాలని వాషింగ్‌టన్ ఎత్తులు వేసింది. కానీ, ఆ ప్రణాళికలు వికటించి, అమెరికా తాను సృష్టించిన సంక్షోభంలో తానే చిక్కుకుపోయింది. ఇప్పుడు ముందుకు సాగలేక.. వెనక్కి రాకపోలేక నానా తంటాలు పడుతోంది.ఇరాన్ జనాభాలో సుమారు 10 శాతం ఉండే కుర్దులు, ఇస్లామిక్ పాలనకు వ్యతిరేకంగా దశాబ్దాలుగా పోరాడుతున్నారు. సిరియాలో ఐఎస్‌ఐఎస్‌ను ఎదుర్కొనేందుకు అమెరికా సైన్యమే వీరికి శిక్షణ ఇచ్చింది. ఆ అనుభవంతో కుర్దిష్ పెష్మెర్గా (మృత్యుదళం) ఇరాన్ సరిహద్దులు దాటి భూతల యుద్ధం చేసేందుకు సిద్ధంగా ఉంది. తుర్కియే, ఇరాన్ మధ్య నలిగిపోయిన కుర్దులు, ఈ దాడుల్లో పాల్గొంటే తమకు భారీ ప్రతిఫలం దక్కుతుందని ఆశించింది. కుర్దిష్ గ్రూపులు ఇరాన్‌పై పోరాటానికి సిద్ధమయ్యాయి. ఇరాక్‌లో ఉన్న కుర్దిష్ దళాలు ఇరాన్‌లోకి చొరబడేందుకు ఆయుధ విభాగాలను సిద్ధం చేస్తున్నాయి.పాకిస్తాన్‌పై దీర్ఘకాలిక పోరాటం చేస్తున్న బలూచ్‌లను కూడా అమెరికా వాడుకోవాలని చూస్తోంది. గతంలో 'సీపెక్' ప్రాజెక్టును వ్యతిరేకించి, చైనా ఇంజినీర్లపై దాడులు చేసిన బలూచ్‌లు, అమెరికా మద్దతును ఆశిస్తున్నారు. కానీ, బలూచ్‌లకు హామీ ఇస్తే పాకిస్తాన్‌ను దూరం చేసుకోవాల్సి వస్తుంది. ఇజ్రాయెల్‌కు మాత్రం ఈ సమస్య లేదు, అయితే భూతల యుద్ధం ప్రారంభమైతే మొత్తం ప్రాంతం గందరగోళానికి గురయ్యే ప్రమాదం ఉంది.ఇరాన్ విషయంలో అమెరికా ప్రాథమికంగా భావించిన దానికి విరుద్ధంగా పరిస్థితులు మారాయి.. సుప్రీంలీడర్ మరణంతో ఇరాన్ విచ్ఛిన్నమవుతుందని, అసంతృప్తితో ఉన్న ప్రజలు వీధుల్లోకి వస్తారని, కుర్దులు, బలూచ్‌లు తిరగబడితే సులభంగా గెలుస్తామని అమెరికా అంచనా వేసింది. కానీ ప్రజలు ప్రభుత్వానికి మద్దతుగా నిలిచారు. యుద్ధం కారణంగా ప్రజల్లో ఐక్యత పెరిగింది. అంచనాలు తలకిందులు కావడంతో అమెరికా ఇప్పుడు తక్కువ నష్టంతో బయటపడలేని సంకట స్థితిలో ఉంది.యుద్ధానికి ముందు ప్రజాదరణ కోల్పోయిన ఇరాన్ ప్రభుత్వం యుద్ధం మొదలైన తర్వాత జాతీయ భావోద్వేగాన్ని రెచ్చగొట్టి ప్రజల మద్దతును సంపాదించుకుంది. ఇరాన్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్(ఐఆర్‌జీసీ) స్థానిక మత కేంద్రాల నుంచి సైనికులను చేర్చుకుంటూ, భూభాగంపై గట్టి పట్టును కొనసాగిస్తోంది. అమెరికా నిఘా నివేదిక కూడా ఇరాన్ ప్రభుత్వం కూలిపోయే పరిస్థితి లేదని నిర్ధారించింది.అమెరికా ఇరాన్‌లో చేస్తున్న పొరపాటు, నాడు అఫ్గానిస్తాన్‌లోనూ చేసింది. అఫ్గాన్‌లో హజారాలను శిక్షణ ఇచ్చి తాలిబన్‌లకు వ్యతిరేకంగా ఉసిగొల్పింది. వాళ్లు 20 ఏళ్లు పరస్పరం దాడులు చేసుకున్నారు. చివరికి అమెరికా వెనుదిరిగి, తాలిబన్‌లతోనే ఒప్పందం చేసుకుంది. ఇప్పుడు ఇరాన్‌లో అమెరికా పరిస్థితి ఇలాగే కనిపిస్తోంది.అమెరికా, ఇజ్రాయెల్ తమ సొంత సైన్యాలను



పంపించాలనుకున్నా, నిపుణులు దీనిని వ్యూహాత్మకంగా తప్పుడు ఎత్తుగడగా భావిస్తున్నారు. ఇరాన్ సంక్లిష్ట పర్వత, ఎడారి భౌగోళిక పరిస్థితులు, స్థానిక జనాభా మద్దతు లేకపోవడం, ఐఆర్‌జీసీ బలమైన నెట్‌వర్క్ కలిగి ఉండడం, హోర్మూజ్ జలసంధి మూసివేత ముప్పు అమెరికాను భయపెడుతున్నాయి.మొత్తంగా ఇప్పుడు అమెరికా ముందుకూ కదల్లేక, వెనక్కీ వెళ్లలేని పరిస్థితిలో ఉంది. ఇరాన్‌పై దాడులు కొనసాగిస్తే, ప్రాంతీయ యుద్ధం తప్పదు. వెనుదిరిగితే, అంతర్జాతీయ ప్రతిష్ట దెబ్బతింటుంది. ఇప్పటికే ఆయిల్ ధరలు పెరిగి, అమెరికా స్టాక్ మార్కెట్లు కుప్పకూలుతున్నాయి. ఇజ్రాయెల్‌తో వ్యూహాత్మక భేదాలు తలెత్తుతున్నాయి. తప్పుడు అంచనాలపై నిర్మించిన వ్యూహం ఇలా కుప్పకూలింది.

# తెలుగు రాష్ట్రాల్లో పవర్ ఫుల్ లీడర్స్




హైదరాబాద్,: తెలుగు రాష్ట్రాల నాయకులు మరోసారి తమ సత్తా చాటుకున్నారు. దేశంలోనే ప్రత్యేక గుర్తింపు సాధించారు. ప్రఖ్యాత జాతీయ దినపత్రిక ఇండియన్ ఎక్స్‌ప్రెస్ తాజాగా ప్రకటించిన ' 100': 2026 పేరుతో అత్యంత శక్తివంతమైన భారతీయుల జాబితాను ప్రకటించింది. అందులో తెలుగు ప్రముఖులకు చోటు దక్కింది. దేశ గమనాన్ని శాసించగల వందమంది ప్రముఖులతో రూపొందించిన ఈ జాబితాలో తెలుగు నేతలకు అగ్రతాంబూలం దక్కడం విశేషం. ఏపీ సీఎం చంద్రబాబు, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఈ జాబితాలో ఉన్నారు. అందరికంటే మెరుగైన స్థితిలో ఏపీ సీఎం చంద్రబాబు ఉండడం విశేషం.దేశంలో అత్యంత శక్తివంతమైన వ్యక్తులను ఈ జాబితాలో చేర్చారు. అందులో ఏపీ సీఎంచంద్రబాబు 13వ స్థానంలో నిలవడం విశేషం. అత్యంత శక్తివంతమైన తెలుగు నాయకుడిగా ఆయన తన ఆధిపత్యాన్ని చాటుకున్నారు. కేంద్రంలో సంకీర్ణ ప్రభుత్వ ఏర్పాటులో కీలక పాత్ర పోషించడం, ఏపీ పునర్నిర్మాణంలో ఆయన చూపుతున్న చొరవ జాతీయ స్థాయిలో సైతం గుర్తింపు పొందింది. ఇక తెలంగాణ రాజకీయాల్లో సంచలనంగా మారారు సీఎం రేవంత్ రెడ్డి. ఆయన ఈ జాబితాలో 25వ స్థానంలో నిలిచారు. కాంగ్రెస్ పార్టీలో రాహుల్ గాంధీ తర్వాత అత్యంత ప్రభావశీలుడైన నేతగా రేవంత్ గుర్తింపు సాధించారు. మల్లికార్జున్ ఖర్గే, ప్రియాంక గాంధీ వంటి సీనియర్లను వెనక్కి నెట్టి రేవంత్ రెడ్డి ఈ జాబితాలో ముందంజలో ఉండడం విశేషం.మరోవైపు ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్68వ స్థానంలో నిలిచారు. మరోసారి తన గ్లామర్ ను నిరూపించుకున్నారు. జాతీయస్థాయిలో మంచి నాయకుడిగా గుర్తింపు పొందారు. కేంద్ర మంత్రి గింజరాపు రామ్మోహన్ నాయుడు సైతం 90 స్థానంలో నిలిచారు. కేంద్ర క్యాబినెట్లో తెలుగు రాష్ట్రాల నుంచి యువనేతగా ఎంపికైన ఆయన మంచి వాగ్ధాటితో ముందుకు సాగుతున్నారు. అయితే ఏపీలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ, తెలంగాణలో బీఆర్ఎస్ నుంచి ఒక్కరంటే ఒక్క నేతకు కూడా ఈ జాబితాలో స్థానం దక్కకపోవడం విశేషం. ఒకప్పుడు అద్భుత విజయంతో జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు సాధించారు జగన్మోహన్ రెడ్డి. కానీ ఇప్పుడు అదే స్థాయిలో ఓటమితో దారుణంగా దెబ్బతిన్నారు రాజకీయంగాను. అయితే ఒక జాతీయ పత్రిక ప్రకటించిన జాబితాలో ఆ రెండు పార్టీలకు ఇప్పుడు చోటు దక్కకపోవడం మాత్రం నిజంగా లోటు.

## గ్రామ సభలో గందరగోళం..

తూప్రాన్: ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక పై 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక పై చేపట్టిన గ్రామ సభ గందరగోళానికి దారితీసింది. మనోహరాబాద్ మండలం ముప్పిరెడ్డిపల్లి గ్రామంలో స్పెషల్ అధికారి ఇంచార్జి ఎంపిడిఓ కృష్ణ మూర్తి సర్పంచ్ కందల రాజనర్సింహ ఆధ్వర్యంలో చేపట్టిన గ్రామ సభలో పథకాలను ఈవో ప్రజలకు వివరిస్తుండగా బీఆర్ఎస్ నాయకులు నిలదీయడంతో కాంగ్రెస్ నాయకులు వాగ్వాదానికి దిగారు. ఇఫ్తర్ తోఫా ఇవ్వలేదని ముస్లిం మహిళలు ఆందోళన చేశారు. దీంతో గ్రామ సభ మొత్తం గందరగోళానికి దారితీసింది. రెండు వర్గాలు తీవ్ర విమర్శలు చేసుకున్నారు.




# వైసీపీ క్రెడిట్ వార్




కడప: వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికారానికి దూరమై రెండేళ్లు అవుతోంది. కానీ ఇప్పుడు రాష్ట్రంలో ఏ ప్రాజెక్టులు పూర్తయినా.. కొత్తవి వస్తున్నా.. అవి తమ క్రెడిట్ అన్నట్టు వ్యవహరిస్తోంది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. తిరిగి క్రెడిట్ చోరీ అంటూ కూటమి ప్రభుత్వంపై విరుచుకుపడుతోంది. మొన్నటి వరకు జగన్మోహన్ రెడ్డి తాము చేసింది చెప్పుకోలేదని చెబుతున్నారు. ఇప్పుడు ఇదిగో మేం చేసాం అంటూ కొత్త పల్లవి అందుకుంటున్నారు. తాజాగా శ్రీకాకుళం జిల్లాలో ఛలో మూలపేట పోర్ట్ అంటూ సౌండ్ చేసింది వైసిపి. టెక్కలి నియోజకవర్గ పరిధిలో నిర్మిస్తున్న ఈ పోర్టు నిర్మాణం తుది దశకు చేరుకుంది. కానీ తమ ప్రభుత్వ హయాంలోనే నిర్మాణం జరిగింది అంటూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కొత్త వాదనను తెస్తోంది. తమ హయాంలోనే 70 శాతం పనులు జరిగాయని.. తమకి క్రెడిట్ ఇవ్వాలని కోరుతోంది. నిన్ననే ఆ పోర్టు వద్ద భారీ బహిరంగ సభ ఏర్పాటు చేసి వైసిపి నాయకులు గట్టిగానే సౌండ్ చేశారు.2023లో ఈ పోర్టు పనులను ప్రారంభించింది వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ. అక్కడకు ఏడాది కాలంలోనే ఎన్నికలు వచ్చాయి. అయితే తాము దిగిపోయే నాటికి 70% పనులు పూర్తి చేశామని చెబుతోంది ఆ పార్టీ. ఏడాది కాలంలో 70 శాతం పనులు చేస్తే.. ఈ రెండేళ్ల కాలంలో 30% పనులు జరిగాయా అనే ప్రశ్న వినిపిస్తోంది. పైగా వైసీపీ హయాంకంటే కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాతే పనులు వేగవంతం అయ్యాయన్న వాదన ఉంది. కానీ వైసీపీ ఆలోచన అదికాదు. ఈ పోర్టు నిర్మాణంలో తమ పార్టీ ముద్ర ఉండాలని బలంగా కోరుకుంటుంది. పైగా అదనపు భూసేకరణ అనే అంశం తెరపైకి వస్తే దానిని పట్టుకొని పోరాటం చేయాలని చూస్తోంది. తద్వారా టెక్కలి నియోజకవర్గంలో పాటు శ్రీకాకుళం జిల్లాలో పట్టు పెంచుకోవాలని భావిస్తోంది. అందుకే ఉత్తరాంధ్ర నుంచి వైసిపి నేతలంతా ఈ కార్యక్రమా నికి కదలి వచ్చారు.ప్రస్తుతం మూలపేట పోర్టు పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. దాదాపుతుది దశకు చేరుకుంటున్నాయి.ఈ ఏడాది నవంబర్ నాటికి నిర్మాణ పనులు పూర్తిచేసి పోర్టు ప్రారంభించాలని ప్రభు త్వం భావిస్తోంది. వచ్చే నెలలో ట్రయల్ రన్ నిర్వహించడానికి సన్నాహాలు చేస్తోంది. ఈ సమాచారంతోనే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అప్రమత్తమైనట్లు తెలుస్తోంది. సాధారణంగా ఏదైనా ప్రాజెక్టు పూర్తయ్యాక క్రెడిట్ కోసం ప్రయత్నిస్తుంటారు. కానీ ప్రాజెక్టు ప్రారంభానికి ముందే భారీ బహిరంగ సభ ఏర్పాటు చేయడం ద్వారా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ వ్యూహాత్మకంగా వ్యవహరించింది. ఇది మా వల్లే సాధ్యం అయింది అని ప్రజల్లోకి సంకేతాలు పంపించగలిగింది.

## రోడ్డు ప్రమాదంలో అన్నదమ్ముల మృతి

హైదరాబాద్: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు అన్నదమ్ములు దుర్మరణం చెందారు. ఈ విషాదకర సంఘటన హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం ముప్పారంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. జనగామ జిల్లా తరిగొప్పుల మండలం నర్సాపూర్‌కు చెందిన ఓ కుటుంబం కారులో వెళుతుండగా అదుపు తప్పి చెట్టును ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో ఇద్దరు సోదరులు అక్కడికక్కడే మృతి చెందగా మరో ఐదుగురు గాయపడ్డారు. గమనించిన స్థానికులు క్షతగాత్రులను హాస్పిటల్‌కు తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# సినిమా

## రణబాలి షూటింగ్ వీడియో లీక్..

# విజయ్ పవర్ ఫుల్ డైలాగ్‌కి ఫ్యాన్స్ ఫిదా



టాలీవుడ్ స్టార్ హీరో విజయ్ దేవరకొండ, నేషనల్ క్రష్ రష్మిక మంధాన మూడోసారి జంటగా నటిస్తున్న చిత్రం రణబాలి.రాహుల్ సంకృత్యన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాపై ప్రారంభం నుంచే భారీ అంచనాలు ఉన్నాయి. మైత్రీ మూవీ మేకర్స్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ చిత్రం సెప్టెంబర్ 11న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఇటీవల విడుదలైన విజయ్-రష్మిక పెళ్లి ఫోటో, “ఏందయ్యా సామీ” పాటకు వచ్చిన స్పందనతో సినిమాపై హైప్ మరింత పెరిగింది. ఈ క్రమంలో సోషల్ మీడియాలో ‘రణబాలి’ కథ ఇదేనంటూ ఓ కథనం కూడా వైరల్ అవుతోంది.వైరల్ అవుతున్న కథ ప్రకారం, ‘రణబాలి’ 1876 ప్రాంతంలో బ్రిటిష్ పాలనలో ఉన్న రాయలసీమ నేపథ్యంలో సాగుతుంది. కరువు కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న సమయంలో, బ్రిటిష్ అధికారి ప్రజలను మరింత దెబ్బతీసే విధంగా ఆర్టిఫిషియల్ ఫామైన్ సృష్టిస్తాడు. ధాన్యాన్ని గిడ్డంగుల్లో నిల్వచేసి ప్రజలను ఆకలితో వేదించే ఈ క్రూర యత్నం కథకు ప్రధాన నేపథ్యంగా నిలుస్తుంది.ఈ పరిస్థితుల్లో రంగంలోకి దిగే హీరో రణబాలి. ఒకప్పుడు చిన్న సంస్థానానికి వారసుడైన అతను, ప్రజల కోసం పోరాడే యోధుడిగా మారతాడు. బ్రిటిష్ అధికారులకు అతను ప్రమాదకరుడిగా కనిపించినా, ప్రజల దృష్టిలో మాత్రం ఆశగా నిలుస్తాడు. ఇక హీరోయిన్ జయమ్మ పాత్రలో రష్మిక కనిపించనుంది. కరువు తన కుటుంబాన్ని దెబ్బతీసినా ధైర్యంగా నిలిచే జయమ్మ, రణబాలి పోరాటానికి భావోద్వేగ బలం అవుతుంది. వీరిద్దరి మధ్య ప్రేమ సహజంగా, గ్రామీణ నేపథ్యంతో ముడిపడి ఉంటుంది. కథలో రణబాలి గెరిల్లా యుద్ధంతో బ్రిటిష్ గిడ్డంగులపై దాడులు చేస్తూ, ప్రజలకు ఆహారం పంచడం, దేశ సంపదను విదేశాలకు తరలించే ప్రయత్నాలను అడ్డుకోవడం వంటి అంశాలు ఉంటాయని తెలుస్తోంది. అలాగే ఆ సంపదతో ప్రజలకు సహాయం చేస్తూ ఆశ నింపే పాత్రగా అతను నిలుస్తాడు.ఈ పోరాటాన్ని అణిచివేయడానికి బ్రిటిష్ అధికారి రణబాలి తలను తీసుకొచ్చిన వారికి భారీ బహుమతి ప్రకటిస్తాడు. అక్కడినుంచి కథ మరింత ఉత్కంఠభరితంగా మారుతుంది. చివరికి బ్రిటిష్ రికార్డుల ప్రకారం రణబాలి మరణించినట్లు చూపించినా, ప్రజల మనసుల్లో అతను చిరస్థాయిగా నిలిచే నాయకుడిగా మిగిలిపోతాడనే ట్విస్ట్ కథలో ఉంటుందని ప్రచారం జరుగుతోంది. అయితే తాజాగా రణబాలి షూటింగ్ లొకేషన్ నుండి విజయ్ దేవరకొండకి సంబంధించిన వీడియో ఒకటి లీక్ అయింది. ఇందులో విజయ్ చేతిలో కత్తి పట్టుకొని గుర్రంపై ఇళ్లలోకి వచ్చి.. ఒరేయ్ ముండమోపి నా కొడకా...ఏడున్నావ్ రా.. మీ ఇళ్లలోకి వచ్చా.. రా అవ్వా చంపుదువ్ కాని .. అనే డైలాగ్ చెబుతాడు. చూస్తుంటే విజయ్ ఈ సినిమాతో మంచి హిట్ కొట్టేలా ఉన్నాడని అంటున్నారు.

# బిజీగా ప్రియాంక అరుళ్



టాలీవుడ్‌లో విడుదలకు సిద్ధంగా ఉన్న చిత్రం.. ’ఓజి’.పవర్ స్టార్ పవన్ కల్యాణ్ హీరోగా తెరకెక్కిన ఈ సినిమాపై హైప్ రోజురోజుకూ పెరుగుతూనే ఉంది. ప్రియాంక అరుళ్ మోహన్ ఎంట్రీతో సినిమాపై క్రేజ్ మరింత పెరిగింది. ఇప్పటికే ప్రియాంక పై విడుదలైన సాంగ్స్, కొన్ని విజువల్ సోషల్ మీడియాలో వైరల్ అవుతూ మంచి బజ్ క్రియేట్ చేశాయి. తన గ్లామరస్ ప్రెజెన్స్‌తో పాటు, పవన్ కళ్యాణ్‌తో ఉన్న స్క్రీన్ కెమిస్ట్రీక్రి ఆడియన్స్ నుంచి మంచి రెస్పాన్స్ వచ్చింది. కాగా ఆమె ఇప్పుడు సినిమా ప్రచార కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. ప్రియాంక తాజాగా ఓజి ప్రమోషన్స్ కోసం బయటికొచ్చి ప్రింట్ మీడియా, వెబ్ మీడియా లకు ఇంటర్వ్యూలు ఇస్తూ చిత్రంపై ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. దీంతో ఈ చిత్రం ప్రమోషన్ల అసలైన జోరు మొదలైందని చెప్పవచ్చు. ఇకపై ప్రియాంకతో పాటు- మిగతా ప్రధాన నటీ-నటు-లు కూడా ఈ ప్రమోషన్లలో భాగం కానున్నట్లు- సమాచారం. ఇక ఈ సినిమా పాన్-ఇండియా లెవెల్‌లో తెరకెక్కుతున్న నేపథ్యంలో, ఇతర భాషల్లో కూడా ప్రమోషన్స్ ఎలా ఉంటాయన్నదే ఇప్పుడు ఫ్యాన్స్‌లో కుతూహలంగా మారింది. ముఖ్యంగా బాలీవుడ్ నటుడు ఇమ్రాన్ హష్మీ ఇందులో కీలక పాత్ర పోషిస్తున్న సంగతి తెలిసిందే. ఆయన ఎంట్రీతో ఓజికి హిందీ లోను మంచి మార్కెట్ ఏర్పడింది. అందుకే హిందీలో ప్రత్యేక ప్రమోషన్లు ఎలాన్ చేస్తున్నారా? అన్న ప్రశ్న ఇప్పుడు అభిమానుల్లో చర్చనీయాం శంగా మారింది. ఇప్పుడిప్పుడే మొదలైన ప్రమోషన్లతో సినిమా హంగామా మరింత పెరిగేలా కనిపిస్తుంది. రాబోయే రోజుల్లో ఓజి టీ-మ్ నుంచి ఇంకా పెద్ద ప్రమోషనల్ ఈవెంట్స్, స్పెషల్ ఇంటర్వ్యూ లు, మ్యూజిక్ ఈవెంట్, ప్రీ-రిలీజ్ ఫంక్షన్ లాంటివి ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాయి. ఈ ప్రమోషన్ లు కలిపి సినిమా కోసం ప్రేక్షకుల అంచనాలను మరింత ఎత్తుకు తీసుకెళ్లడం ఖాయం.

# ఆట పేరుతో బుక్కయిపోయిన ఆలియా



ఒకరితో ప్రేమలో ఉన్నాడని తెలిసీ ఆయువకుడిని ప్రేమిస్తానని, అతడినే ఇష్టపడతానని అంటే దాని అర్థం ఏమిటి? నైతికంగా తప్పుడు ప్రవర్తనగానే దీనిని భావిస్తారు. అయితే సిగ్గు విడిచి అలాంటి పనికి తాను సిద్ధమేనని ఒప్పుకుంది ఆలియా భట్. టూమచ్ విత్ ట్వింకిల్ అండ్ కాజోల్ షోలోమీరు ఇష్టపడతారా? అనే విచిత్రమైన విభాగంలో ఆలియా భట్ తన గుట్టును దాచుకోకుండా బయటపెట్టేసింది. ప్రస్తుతం ఈ ఇంట్రెస్టింగ్ క్లిప్ అంతర్జాలంలో వైరల్ అవుతోంది. వీడియో క్లిప్ చూడ గానే ఆలియా భట్‌పై నెటిజనులు విరుచుకుపడుతున్నారు. గేమ్ షోలో ఆలియా వ్యాఖ్యానిస్తూ, తన స్నేహితురాలి మాజీతో ప్రేమలో పడతాను అనే ఆప్షన్ ని ఎంచుకుంది. ఇది నిజంగా కత్రినను మోసం చేయడమే నని కూడా జనం కామెంట్ చేస్తున్నారు. ఆ సమయంలో కాజోల్, వరుణ్ అందరూ ఆశ్చర్యపోయారు. గతంలో కత్రినతో రణబీర్ రిలేషన్ షిప్ లో ఉన్న సమయంలోనే ఆలియాతోను అతడు డేటింగ్ చేసాడనే పుకార్లు ఉన్నాయి. ఇప్పుడు మరోసారి ఆలియా కారణంగానే రణబీర్ తన ప్రియురాలు కత్రిన నుంచి విడిపోయాడు! అనే అర్థం వచ్చేలా వ్యవహారం కనబడటంతో నెటిజనులు ఆలియాపై విరుచుకుపడుతున్నారు.ఆలియా కారణంగానే రణబీర్ తనప్రేయసి కత్రినను మోసం చేసా డా?అంటూ ప్రశ్నిస్తున్నారు. అసలే ఆలియా కారణంగానే ఇలా జరిగి ందని అప్పట్లో పుకార్లు ఉన్నాయి.. వాటిని ఇంకా ప్రజలు మర్చిపోక పోయినా, ఇప్పుడు ఆలియా నోరు జారడం కొంప ముంచింది.

# ప్రభాస్‌తో ప్రశాంత్‌వర్మ మూవీ



జెట్ స్పీడ్‌లో దూసుకుపోతున్న రెబల్ స్టార్ ప్రభాస్ ప్రస్తుతం వరుస సినిమాలతో ఫుల్ బిజీగా ఉన్నారు. ఇప్పటికే మారుతి దర్శకత్వంలో హర్రర్ కామెడీగా రూపొందుతోన్న రాజాసాబ్ త్వరలో విడుదలకు సిద్ధమవుతుతండగా, సందీప్ రెడ్డి వంగా స్పిరిట్, ప్రశాంత్ నీల్ సలార్ పార్ట్ 2, హను రాఘవపూడి దర్శకత్వంలో పీరియాడికల్ వార్ డ్రామా ఫౌజీ, నాగ అశ్విన్ కల్కి పార్ట్2 సినిమాలు లైన్‌లో ఉన్నాయి. ఇదిలా ఉంటే.. మరో ఆసక్తికరమైన అప్డేట్ వినిపిస్తోంది. హనుమాన్ సినిమాతో దేశ వ్యాప్తంగా గుర్తింపు సంపాదించుకున్న దర్శకుడు ప్రశాంత్ వర్మ తో ప్రభాస్ కొత్త సినిమా త్వరలోనే ప్రారంభం కానుందని తెలుస్తోంది. కొంతకాలంగా సైలెంట్‌గా ఉన్న ప్రశాంత్ వర్మ ఈ ప్రాజెక్ట్‌కు సంబంధిం చిన ప్రీ విజువలైజేషన్ పనులను పూర్తి చేశాడని ఇండస్ట్రీలో చర్చ సాగుతోంది. ప్రతి సీన్, ప్రతి క్యారెక్టర్, ప్రతి షాట్ ముందే డిజైన్ చేయబడి ఉన్నట్లు-సమాచారం.దీంతో షూటింగ్ ప్రారంభమైన తర్వాత కూడా ఈ ప్రణాళిక ప్రకారం సమర్థంగా పని చేయగలరని అంటున్నారు.ఈ సినిమాకు ప్రస్తుతం ‘బ్రహ్మ రాక్షస్‘అనే వర్కింగ్ -టైటిల్ వినిపిస్తోంది. అయితే, -టైటిల్ మారే అవకాశాలు కూడా ఉన్నట్లు- తెలుస్తోంది. ప్రస్తుతం ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో రూపొందుతున్న ’హను-మాన్’ సీక్వెల్ ’జై హను-మాన్’ పై కూడా భారీ అంచనాలు ఉన్నాయి.

# సంయుక్త మీనన్ ..ది బ్లాక్ గోల్డ్



ది బ్లాక్ గోల్డ్’ సినిమాతో ప్రేక్షకుల్ని పలకరించనుంది సంయుక్తా మేనన్. ఇది ఆమె చేస్తున్న తొలి నాయికా ప్రాధాన్య చిత్రం. యోగేశ్ కేఎంసీ తెరకెక్కిస్తున్నారు. రాజేశ్ దండా నిర్మిస్తున్నారు. మురళీ శర్మ, రావు రమేశ్, నాజర్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమా ఈ వేసవిలో తెలుగు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో విడుదల కానుంది. ఈ విషయాన్ని కొత్త ఏడాది సందర్భంగా గురువారం ప్రకటించారు. ఈ మేరకు ఓ కొత్త పోస్టర్‌ను పంచుకున్నారు. ‘ఊహించని మలుపులతో సాగే సరికొత్త కథతో.. అద్భుతమైన యాక్షన్ సన్నివేశాలతో ఈ సినిమా అందర్నీ అలరించేలా ఉండనుంది. సంయుక్త దీంట్లో శక్తిమంతమైన పోలీసు పాత్రలో కనిపించనుంది. ఇప్పటికే 75శాతం చిత్రీకరణ పూర్తయింది. మరో 15రోజుల చిత్రీకరణెలి మిగిలి ఉంది. నిర్మాణానంతర పనులు శరవేగంగా జరుగుతున్నాయి.

# టైగర్ ష్రాఫ్‌తో జతకట్టనున్న కృతిశెట్టి



అందాల తార కృతి శెట్టి.. బాలీవుడ్‌లోకి అడుగుపెట్టనుందా? అంటే అవుననే అంటున్నాయి సినీ వర్గాలు. హిందీ యాక్షన్ హీరో టైగర్ ష్రాఫ్‌తో దర్శకుడు మిలాప్ జవేరి ఓ చిత్రం కోసం చేతులు కలిపినట్లు కొన్ని రోజులుగా వార్తలు వస్తోన్న సంగతి తెలిసిందే. తాజాగా ఇందులో కథానాయికగా కృతి శెట్టిని ఎంపిక చేసిందట చిత్రబృందం. ‘ప్రముఖ నిర్మాణ సంస్థ టీ-సిరీస్ దీన్ని భారీ బ్జడెట్‌తో రూపొందించాలని నిర్ణయించుకుంది. జనవరిలో ముంబయిలో చిత్రీకరణ ప్రారంభం కానున్న ఈ సినిమాలో టైగర్ సరసన నటించడానికి కృతి ఇప్పటికే గ్రీన్ సిగ్నల్ ఇచ్చేసింది. ఇదే ఆమెకు తొలి హిందీ చిత్రం కావడం విశేషం. యాక్షన్ థ్రిల్లర్‌గా తీర్చిదిద్దుతున్న ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది ద్వితీయార్ధంలో విడుదల చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. త్వరలో దీనిపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశాలున్నాయ‘ని కృతి సన్నిహిత వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం ఆమె నటించిన ’లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ’, ’వా వాతియార్’ విడుదలకు సిద్ధంగా ఉన్నాయి.

Published, printed and Owned by Merugu Chandra Mohan Printed at Sahaja publications, H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana.
Published from H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana. RNI. NO: TELTEL/2023/88215